
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు 5

మంగళవారం 26 ఆగస్టు 2025

రాష్ట్ర మంత్రుల సమావేశం రద్దు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర మంత్రుల సమావేశం రద్దయింది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ల సమావేశం రద్దు అయినట్లు కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అక్రమార్కులు ఎక్స్‌కవేటర్లతో కొండల్లో పడ్డారు. ఎర్రగరుసు వారికి ఆదాయ వనరుగా మారింది. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేసిన క్వారీ గుంతలు పూడ్చేయడం లేదు. రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఆ గుంతలే నోళ్లు తెరిచాయి. అభాగ్యుల ప్రాణాలు బలితీసుకుంటున్నాయి. ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో అక్రమంగా ఎర్రగరుసు క్వారీ తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో అభంశుభం తెలియని ఐదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఈతకెళ్లి మృత్యువాత పడ్డారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎర్రమట్టి, నాపరాతి క్వారీ గుంతల్లో పడి పలువురు మృత్యుఒడి చేరినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఎర్రమట్టి అక్రమ తవ్వకాలతో అక్రమార్కులు రూ.లక్షలు దండుకుంటున్నారు. వారికి నియోజకవర్గం ప్రజాప్రతినిధుల అండ ఉండడంతో అధికారులు గాంధారి పాత్ర పోషిస్తున్నారు. అనుమతులు లేని అక్రమ ఎర్రగరుసు క్వారీ గుంతలు ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోరా..? ప్రాణాంతకంగా మారిన గుంతలు పూడ్చేయరా..? రక్షణ చర్యలు తీసుకుంటారా..? వీటికి అధికారులే సమాధానం చెప్పాలి. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



ఆస్పరి మండలం చిగిలిలో ఐదో తరగతి చదివే ఆరుగురు విద్యార్థులను బలి తీసుకున్న ఎర్రగరుసు గుంత ఇది.

బలితీసుకుంటున్నాయ్..!

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్రమంగా క్వారీ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలో గత వైసీపీ హయాంలో ఎర్ర గరుసు అక్రమ క్వారీ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగాయి. నాడు ఎమ్మెల్యేల అండదండలు ఉండడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించారు. జిల్లా కేంద్రం కర్నూలు శివారులో జగన్నాథగట్టును రాజకీయ అండతో 'కర్నూలు గ్రావెల్ ఫీల్డ్ (కేజీఎఫ్)'గా మార్చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అక్రమ తవ్వకాలకు చెక్ పడలేదు. జిల్లా అంతటా ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అరికట్టాల్సిన అధికారులు రాజకీయ జోక్యం, మాముళ్ల మత్తులో కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టి, నిర్లక్ష్యంగా వదిలేసిన ఆ గుంతలే ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. ఉజ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారులను మృత్యుకూపంలోకి లాగేస్తున్నాయి.

చిగిలి, బిణిగేరి గ్రామాల మధ్య..

ఆస్పరి మండలం చిగిలి, బిణిగేరి గ్రామాల మధ్య సర్వే నంబరు 195లో 119 ఎకరాలు ఎర్రగరుసు నిక్షేపాలు కలిగిన ప్రభుత్వ భూములు (కొండలు) ఉన్నాయి. ఎర్రగరుసు తవ్వకాలు, అమ్మకాలు ద్వారా కాసుల వేటలో అక్రమార్కులు రాజకీయ అండతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టారు. నాడు వైసీపీ హయాంలో నేడు కూటమి నేతల అండదండలతో ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టడంతో భారీ గుంతలు ఏర్పడిన గుంతలు వర్షపు నీటితో నిండి నోళ్లు తెరిచిన గుంతలే స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న పదేళ్ల వయసు కలిగిన ఆరుగురు విద్యార్థులను బలి తీసుకుంది. చిగిలిలో ఒక్కటే కాదు.. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఎర్రమట్టి, నాపరాతి, గ్రానైట్ రాయి క్వారీ గుంతలు ప్రమాదకరంగా మారాయి. అలాంటి గుంతలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- నోళ్లు తెరిచిన క్వారీ గుంతలు..
- అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు..
- ప్రాణాలు తీస్తున్నా పట్టించుకోని వైనం
- కొలిమిగుండ్ల నాపరాతి క్వారీ గుంతలో పడి ఒకరి మృతి
- పదేళ్ల క్రితం కోసిగిలో నలుగురు విద్యార్థులు మృత్యువాత
- తాజాగా చిగిలిలో ఆరుగురు విద్యార్థులను మింగేసిన ఎర్రమట్టి కుంట
- ప్రమాదకర గుంతలను పూడ్చేందుకు చర్యలు ఏవీ?



ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ శివారులో ఎల్లెల్సీ కాలువకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా క్వారీ గుంత

ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనలు కొన్ని

- కొలిమిగుండ్ల సమీపంలో నాపరాతి క్వారీ గుంతల్లో చేరిన వర్షపు నీటిలో ప్రమాదవశాత్తు చాంద్‌బాషా పడి ఇటీవల మృతిచెందాడు. కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లో నాపరాత్రి క్వారీ గుంతల దగ్గర ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టక పోవడం వల్ల ఐదారేళ్లలో పది మంది నీటి గుంతల్లో పడి మృతి చెందారు.
- ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల (తెలుగు)కు అతి సమీపంలో ఎస్ఎస్ ట్యాంక్ ఉంది. 2023 నవంబరు 19న బడి వేళలో ఐదో తరగతి చదివే మంజునాథ్, అక్బర్ ఇద్దరు విద్యార్థులు సరదాగా స్నానం కోసం వెళ్లి మృత్యుఒడి చేరారు. రక్షణ చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్థులు విన్నవించినా పట్టించుకోలేదు.



- మండల కేంద్రం కోసిగి గ్రామానికి అతి సమీపంలో బుగేని చెరువులో అక్రమంగా ఎర్రగరుసు తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరాయి. పదేళ్ల క్రితం ఆ గుంతల్లో సరదాగా స్నానాలకు వెళ్లిన 5-6వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు నీట మునిగి మృత్యుఒడి చేరారు.
- మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామ సమీపంలోని చెరువు గుంతలో ఏడాదిలో ఇద్దరు పడి మృతిచెందారు. ఐదేళ్ల క్రితం మరో వ్యక్తి కూడా ఆగుంతలో పడి చనిపోయారు. బుదూరులో మూడేళ్ల క్రితం నీటి గుంతలో పడి ఓ చిన్నారి మృతి చెందారు.

మిగతా 6వ పేజీలో

సమస్యలను త్వరగా పరిష్కరించాలి: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కారం చేసిన అర్జీలను పెండింగ్‌లో లేకుండా ఆడిట్ చేయాలన్నారు. అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 13, పత్తికొండ ఆర్డీవో వద్ద 6, కర్నూలు ఆర్డీవో వద్ద 7, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడీ, హౌసింగ్ పీడీల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని గడువు లోపు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

28 నుంచి డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

- సమాచారం కోసం హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ప్రతిభ చూపి ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల (సర్టిఫికెట్లు) పరిశీలన ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభంవుతుందని కర్నూలు డీఈవో ఎస్.శ్యామ్యూల్ పాల్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి డీఎస్సీ మెరిట్ జాబితా విడుదలైందన్నారు. షెడ్యూలు ప్రకారం 25వ తేది సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉందని, అందుకు అనుగుణంగా రాయలసీమ యూనివర్సిటీ, నన్నూరు సమీపంలోని శ్రీరాఘవేంద్ర, శ్రీనివాస బీఎడ్ కళాశాలల్లో ఏర్పాట్లు చేశామని తెలిపారు. మెరిట్ జాబితా ప్రకారం రిజర్వేషన్లకు అనుగుణంగా స్థానిక (లోకల్), స్థానికేతర (నాన్ లోకల్) కేటగిరిలో ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థిని ఎంపిక చేశారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వారి సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు ఆదివారం విద్యా శాఖ అధికారులు పంపించారని తెలిపారు. తక్కువ సమయం ఉండడం వల్ల డీఎస్సీ అభ్యర్థుల విన్నపం, వారి వెసులుబాటు కోసం 28వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసిందని తెలిపారు. మూడు రోజులు సమయం ఉండడంతో ఎంపికైనట్లు మెసేజ్ వచ్చిన అభ్యర్థులు అవసరమైన సర్టిఫికెట్లు సిద్ధం చేసుకొని గురువారం ఉదయం 8 గంటలకు వారికి కేటాయించిన సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. సమాచారం కోసం హెల్ప్ డెస్క్‌లో ఉండే నరసయ్య - 81218 21266, సూపరింటెండెంట్ మదుల్లా - 96036 83182, అసిస్టెంట్ డైరెక్టర్ కె.నాగభూషణం-91776 79042 నంబర్లను సంప్రదించాలని డీఈఓ సూచించారు.

రజకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రజకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రజకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కలెక్టరేట్ ఎదుట గాడిదలను తరలించి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా వస్త్రాలను ఐరన్ చేస్తూ మహిళలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.గురుశేఖర్, పాతబస్తీ కార్యదర్శి జయమ్మ శ్రీనివాసులు, శేషాద్రి, రాముడు, సుంకన్న, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బార్ల దరఖాస్తులపై ఉత్కంఠ..!

- కర్నూలులో ఒక్కరూ ముందుకు రాని వైనం
- నేడు దరఖాస్తుకు చివరి రోజు

కర్నూలు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బార్ల దరఖాస్తుల ప్రక్రియ ఉత్కంఠ రేపుతోంది. ఆదోనిలోని రెండు బార్లకు 8 దరఖాస్తులు వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయని, అందులో ఆదోనిలో 2 బార్లకు దరఖాస్తులు పడ్డాయని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. కర్నూలు నగరంలో 16 బార్లు ఉండగా ఒక్క బార్ యాజమాని కూడా దరఖాస్తు వేసేందుకు ముందుకు రాకపోవడం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు 105 మంది ఆన్‌లైన్ ద్వారా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోగా అందులో గీతకులాలకు చెందినవి 9 దరఖాస్తులు ఉన్నాయి. ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారు వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటారో.. లేదో అన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలోని 109 మద్యం దుకాణాల పర్మిట్ రూమ్‌లకు అనుమతులు ఇవ్వడంతో బార్ల పరిస్థితి ఇబ్బందిగానే ఉంటుందని యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాలకు కమీషన్‌తోపాటు వెసులుబాటు ఇవ్వడం, బార్లకు సరఫరా చేసే మద్యంలో రాయితీలు లేకపోగా ధరల్లో ఎంఆర్‌పీతో సరఫరా అంటే.. వ్యాపారం చేయడం కష్టమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియపై ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు వద్ద ప్రస్తావించగా మంగళవారం చివరిరోజు దరఖాస్తులు చేసేందుకు యాజమాన్యాలు సంప్రదించనున్నట్లు తెలిపారు.

నేడు టీడీపీ 'త్రీమెన్ కమిటీ' రాక

పార్టీ శ్రేణులు, నేతల నుంచి అభిప్రాయ సేకరణ

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఎవరిని నియమిస్తారోనన్న ఉత్కంఠ ఆ పార్టీలో ప్రధానంగా మారింది. జిల్లా కమిటీ కూర్పు కోసం పార్టీ అధిష్ఠానం నియమించిన త్రీమెన్ కమిటీ మంగళవారం జిల్లాకు రానుంది. తనిష్క్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సంస్థాగత ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్లమెంట్ పార్టీ, తెలుగు మహిళా, తెలుగురైతు, తెలుగు విద్యార్థి, టీఎన్‌టీయూసీ.. వంటి 17 అనుబంధ సంఘాలకు నూతన కమిటీలు ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఆయా కమిటీల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధినేత భావిస్తున్నారు. ఈ క్రమంలో త్రీమెన్ కమిటీ సభ్యులైన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబులు జిల్లాకు రానున్నారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించి అధినేత చంద్రబాబుకు నివేదిక పంపుతారు. ఇదిలా ఉండగా పదేళ్ల తరువాత కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యమిచ్చేలా ఎంపిక ఉండబోతోంది. 1995లో మొదటి సారిగా చంద్రబాబు పార్టీ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. 30 ఏళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టీడీపీలో ప్రతి రెండేళ్లకు ఒకసారి సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తారు. మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తారు. అందులో భాగంగానే తాజాగా పార్లమెంట్ కమిటీ ఎన్నిక కసరత్తు చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కింద స్థాయి కార్యకర్తల అభిప్రాయాలు తీసుకొని జిల్లా అధ్యక్ష, కార్యవర్గం ఎంపిక జరిగేది. అయితే గత 10-15 ఏళ్ల నుంచి అధిష్ఠానమే ఎంపిక చేస్తూ వస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొంటున్నారు. కార్యకర్తల అభీష్టం మేరకే పార్లమెంట్ కమిటీ ఏర్పాటుకు అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంపై ఆ పార్టీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారు ఎవరికి వారు తమ అభిప్రాయాలను బలంగా వినిపించేందుకు సిద్ధమయ్యారు. త్రీమెన్ కమిటీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

మండపాలకు బొజ్జ గణపయ్య

- యువత కోలాహలం
- రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోలాహలంతో కూడిన పండుగ 'వినాయక చవితి'ని ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. బుధవారం వినాయకచవితి కావడంతో జిల్లాతో పాటు కర్నూలు నగరంలో వేలాదిగా వినాయక మండపాలు వెలిశాయి. వాడవాడలా ఏర్పాటైన మండపాలకు వినాయక విగ్రహాలను భక్తులు సోమవారమే తరలించారు. తమ గృహాల్లోని పూజా మందిరాల్లో చిన్న చిన్న మట్టి ప్రతిమలతో రూపొందించిన గణపతి మూర్తులను కూడా భక్తులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. వినాయక చవితి రోజు నుంచి తొమ్మిది రోజుల పాటూ కర్నూలులో కొనసాగే 'గణేశ్ నవరాత్రి' ఉత్సవాల సందడి కనిపించింది. అంబరాన్నంటే సంబరాలతో ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీల నిర్వాహకులు విగ్రహాలను మండపాలకు తరలించారు. సోమవారం రాత్రి పొద్దు పోయే వరకు గణేశ్ ఉత్సవమూర్తులను భారీ డీజే సౌండ్స్ మధ్య తరలిస్తూ యువత సందడి చేసింది. కర్నూలు నగరంలో వినాయక చవితి సందర్భంగా గృహాల్లో పూజించుకునే మట్టి గణపతి ప్రతిమలకు గిరాకీ ఏర్పడింది. నగరంలో పెద్దమార్కెట్, చిన్నమార్కెట్, పూలబజార్, కొండారెడ్డి బురుజు, సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, బళ్లారి చౌరస్తా తదితర ప్రాంతాల్లో వ్యాపారులు చిన్న చిన్న మట్టి విగ్రహాలను విక్రయాలకు పెట్టారు. అలాగే తోపుడు బండ్ల వ్యాపారులు కూడా ఆకర్షణీయ రంగుల్లోని మట్టి గణేశ్ ప్రతిమల అమ్మకాలు సాగిస్తున్నారు. విగ్రహాలు సైజును బట్టి రూ. 100 నుంచి రూ.700 వరకు ధరలు పలుకుతున్నాయి.





విగ్రహాలను తీసుకెళ్తున్న యువకులు



నత్తనడకన రైల్వేస్టేషన్ పునరుద్ధరణ..!

7

కర్నూలు నగరపాలక సంస్థ

ప్రకటన : కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణకు పరిహారంగ ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టి.డి.ఆర్) జారీ చేసే ప్రక్రియ జరుగుచున్నది. మాస్టర్ ప్లాన్ రోడ్డు స్థలాలు/ భవనాలు ప్రభావితమైన యజమానులకు ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ రూల్స్ నెం. G.O.Ms.No.119. MA & UD, Dt. 28.03.2017 లోని రూల్ 167, 168 ప్రకారం టీడీఆర్ మంజూరు చేసే ప్రతిపాదనకు కర్నూలు నగరపాలక సంస్థ స్థాయి సంఘం ఆమోదం తెలిపింది.

తదుపరి ఈ క్రింద వ్యక్తులకు టి.డి.ఆర్.లను ఇవ్వడానికి సంబంధించి 7 రోజుల్లో ప్రజల నుండి అభ్యంతరాలు మరియు సూచనలను ఆహ్వానిస్తూ ఈ ప్రకటనను దినపత్రికలో ప్రచురిస్తున్నాము. ఈ విషయములో ఏ ఆస్తి లేదా ఆస్తియజమానిపై ఏవైనా నిర్దిష్ట అభ్యంతరాలు మరియు సూచనలు ఇవ్వకపోతే, ఎటువంటి అభ్యంతరం లేదని భావించబడుతుంది మరియు రోడ్డు విస్తరణకై స్థలం కోల్పోయే యజమానులకు టి.డి.ఆర్ జారీ చేయబడుతుందని, ఇందుమూలముగా తెలియజేయడమైనది.

భూమి వివరములు : ప్రభుత్వముచే ఆమోదము పొందిన మాస్టర్ ప్లానులో శ్రీ దామోదరము సంజీవయ్య సర్కిల్ నుంచి యస్.యస్.గార్డెన్స్ వరకు ప్రతిపాదించిన 120 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును R & B, APRDC వారు MORTH నిధులతో అభివృద్ధి చేయుటకు ప్రతిపాదనపై 100 అడుగుల వెడల్పుతో Phase-I క్రింద అభివృద్ధి పరచుటకు.

ప్రభావిత సర్వే నెంబరు : జోహరాపురం గ్రామ సర్వే నెంబర్లు: 99/2, 100, 106, 106/1, 107/1, 135 మరియు కల్లూరు గ్రామ 660/A2, 660/C, 661/B, 663/A, 663/B, 664/B, 667/A, 668/A, 668/B, 669

దరఖాస్తుదారు పేర్లు : 1.ఎస్.మహమ్మద్ అష్రఫ్, C/o. ఎస్.అబ్దుల్ లతీఫ్ నసీర్, 2.జె.ప్రవీణ, C/o. జె.శ్రీనివాసులు, 3.పి.మహమ్మద్ హనీఫ్, C/o. పి.మౌలాలి, 4.పి.పెద్ద మౌలాలి, C/o. పి.పాపన్న, 5.వి.బాలకృష్ణ, C/o. వి.చెంచన్న, 6.పి.సిరీష, C/o. కళ్ళ అమర్నాథరెడ్డి, 7.బి.అబ్దుల్లా ఖాన్, C/o. బి.అహ్మదుల్లా, 8.షేక్ అబ్దుల్లా, C/o. షేక్ బాబు మియ్యా, 9.పి.కరీంసాబ్, C/o. పి.గోకరిసాబ్, 10.ఎం.భాగ్యలక్ష్మి, C/o. ఎం.వి.రాజశేఖర్ రెడ్డి, 11.కె.శ్రీకాంత్‌రెడ్డి, C/o. కె.వీరారెడ్డి, 12.ఎస్.రాజశేఖరప్ప, C/o. ఎస్.కుమారప్ప, 13.ఎస్.పార్వతమ్మ, C/o. ఎస్.కుమారప్ప, 14.ఎ.ఖాజా రసూల్, C/o. ఎ.ఫకీర్ సాహెబ్, 15.కె.చంద్రశేఖర్‌రెడ్డి, C/o. కె.వెంకటరెడ్డి, 16.సి.కౌసలమ్మ, C/o. జనార్ధనరెడ్డి, 17.బి.జనార్థనరెడ్డి., C/o. బి.శంకరరెడ్డి, 18.ఇ.లక్ష్మీనారాయణ, C/o. ఇ.భీమయ్య శెట్టి, 19.ఎ.నాగరాణి, C/o. ఎ.మురలీకృష్ణమూర్తి, 20.ఎస్.మహమ్మద్ ఇబ్రహీం, C/o. ఎస్.నబీసాబ్, 21.కె.వెంకటేశ్వరెడ్డి, C/o. కె.రామిరెడ్డి, 22.ఎస్.వెంకటరెడ్డి, C/o. ఎస్.రామిరెడ్డి, 23.జి.తరుణ్‌కుమార్‌రెడ్డి, C/o. జి.లింగారెడ్డి, 24.వి.హితేంద్ర సాయి కృష్ణయాదవ్, C/o. వి.బాలన్న, 25.కె.మహబూబ్ బాషా, C/o. కె.సుల్తాన్ వలి, 26.ఎస్.కె.కళావతి, C/o. ఎస్.కె.శ్రీనివాసులు, 27.డి.పార్వతీదేవి, C/o. డి.శివకుమార్, 28.బి.శ్రీనివాసరావు, C/o. బి.ఫుల్లామ్మారావు, 29.డి.శ్వేతా, C/o. డి.విజయమోహన్‌రెడ్డి, 30.కె.అమర్నాథరెడ్డ, C/o. కె.సూర్యకేశవరెడ్డి, 31.టి.శేఖర్, C/o. టి.సౌందరరాజు, 32.బి.శ్రీదేవి, C/o. బి.జగన్నాథం, 33.ఈ.సరస్వతమ్మ, C/o. ఈ.శ్రీరంగ గోపల్, 34.వి.లలిత, C/o. వి.నారాయణ, 35.ఎస్.గోపాల్, C/o. ఎస్.సీతారామయ్య, 36.డి.శేషమ్మ, C/o. డి.వెంకటరామణ, 37.ఎం.గంగాబాయి, C/o. ఎం.జంబుల్గిరావు, 38.డి.కల్పలత, C/o. డి.వేణుగోపాల్, 39.ఎం.శ్రీనాథ్, C/o. ఎం.సిద్దయ్య, 40.ఎం.గోపాల్, C/o. ఎం.సిద్దయ్య, 41.ఎం.అమరేంద్రుడు, C/o. ఎం.నాగన్న, 42.ఎం.పద్మావతి, C/o. ఎం.వెంకటేశ్వర్లు, 43.ఎస్.పద్మావతి, C/o. ఎం.సూర్యనారాయణ, 44.సోమ మేఘనాథ గౌడ్, C/o. సోమ రామన్న గౌడ్, 45.బి.వెంకటరవీంద్రరెడ్డి, C/o. బి.శేషిరెడ్డి, 46.బి.శేషిరెడ్డి, C/o. బి.ఈశ్వరరెడ్డి, 47.జంపాల శేషమ్మ, C/o. పెద్ద అయ్యన్న.

సం/- కమీషనర్, కర్నూలు నగరపాలక సంస్థ, కర్నూలు.


వరద జలాల్లో చేపల కోసం వల వేస్తున్న మత్స్యకారుడు

అవును.. వారి జీవన విధానం అందరిలా కాదు.. నిత్యం ప్రమాదకరమైన జీవనపోరాటం.. వరద ప్రవాహం ప్రాణాపాయం అని తెలిసినా... తప్పని బ(మె)తుకు పోరాటం.. పారే నీటిలో ప్రాణాలకు తెగించి శ్రమిస్తేనే ఇంటిల్లపాదీ ఆకలి తీరేది.. వెలుగోడు జలాశయం వద్ద మత్స్యకారుల వైవిధ్యమైన జీవన విధానం ఇదీ...

ప్రమాదం.. అయినా తప్పని జీవన పోరాటం

వరదజలాల్లో మత్స్యకారుల చేపల వేట

ఆత్మకూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ మీదుగా వెలుగోడు జలాశయానికి ప్రతిరోజు సుమారు 15వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతోంది. అయితే జలాశయంలోకి వరద జలాలు ప్రవేశించే మార్గంలో మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేట సాగిస్తున్నారు. సంప్రదాయమైన వలలతో పాటు చిక్యాలను వేసి చేపలను పడుతున్నారు. వరదజలాల్లో కొట్టుకుపోయే చేపలను చిక్యాల ద్వారా పట్టుకునేందుకు మత్స్యకారులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. అక్కడే పిల్లాపాపలతో చిన్నపాటి గుడిసెలను ఏర్పాటు చేసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే మకాం వేసి చేపల కోసం నిరీక్షిస్తుంటారు. ప్రస్తుత వరద ప్రవాహంలో ఐదు కేజీలకు మించిన పెద్దపెద్ద చేపలు పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు పోటాపోటీగా చేపలు పడుతున్నారు. తాజా చేపలకు మంచి గిరాకీ ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అక్కడికి చేరుకుని చేపలను కొనుగోలు చేస్తున్నారు. మొత్తానికి మిగతా రోజులతో పోల్చితే వరద ప్రవాహం ఉన్న రోజుల్లో చేపలు ఎక్కువగా చిక్కే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. అందుకే ప్రమాదమని తెలిసినా.. బతుకు పోరాటంలో భాగంగా చేపల వేటను సాగిస్తున్నారు.


వెలుగోడు జలాశయం వద్ద చేపలను కొనుగోలు చేస్తున్న దృశ్యం


వరద జలాల పక్కనే గుడిసెలో మత్స్యకారుల నివాసం

బలితీసుకుంటున్నాయ్..!

5వ పేజీ తరువాయి

కోసిగిలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలకు సుమారుగా 200 మీటర్ల దూరంలో రోడ్డు పక్కనే తెల్ల గరుసు అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అక్రమార్కుల తవ్వకాలతో ఏర్పడిన కుంటలు వర్షపు నీటితో నిండిపోయాయి. మోడల్ స్కూల్‌లో 6-10వ తరగతి, ఇంటర్‌లో 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. చిగిలి ఘటన నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ శివారులో ఎల్లెల్సీ కాలువకు వెళ్లే దారి పక్కనే గ్రానైట్ క్వారీ తవ్వకాలు చేశారు. భారీ కుంటలు ఏర్పడ్డాయి. క్వారీకి అనుమతులున్నా.. గ్రానైట్ అయిపోగానే ఆ కుంటలు పూడ్చకుండా అలాగే వదిలేసి వెళ్లిపోయారు. ప్రమాదకరంగా మారిన ఆ క్వారీ కుంటలు పక్క నుంచి రైతులు, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు.
- ఆలూరు చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి, గరుసు అక్రమ తవ్వకాలు వల్ల పెద్దపెద్ద కుంటలు ఏర్పడ్డాయి. వర్షపు నీటితో నిండిన ఆ కుంటలు ప్రమాదకరంగా మారాయని ప్రజలు పేర్కొంటున్నారు. అగ్రహారం కొండల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది.
- కర్నూలు-ఎమ్మిగనూరు ప్రధాన రహదారి పక్కనే గోనెగండ్లలో ఓ బావి ఉంది. ఇది ప్రమాదకరంగా మారినా పట్టించుకునేవారే లేరు. జిల్లా యంత్రాంగం అదే రహదారి వెంబడే రాకపోకలు సాగిస్తున్నా ప్రాణాంతకంగా మారిన ఆ పాడుబడిన ఆ బావి కనిపించలేదా? ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో మసీదుపురం గ్రామ క్రాస్‌లో నీటి గుంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంతకు సమీపంలోనే ప్రాథమిక పాఠశాల ఉంది.
- పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారి పక్కనే దేవనబండ వద్ద ఎర్రమట్టి తవ్వకాలతో భారీ కుంట ఏర్పడింది. పాఠశాలకు అర కిలోమీటరు దూరంలో ఉన్న ఆ గుంత వర్షపు నీటితో నిండిపోయింది. వాహనదారులకు కూడా ప్రమాదకరంగా ఉంది.

అధికారులు నిద్రమత్తు వీడాలి..

ఉమ్మడి జిల్లాల్లో చిగిలి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే అధికారులు ఇప్పటికైనా నిద్రమత్తు వీడాలి. అనుమతుల పేరిట సాగించే క్వారీలు సహా అక్రమ తవ్వకాలతో ఏర్పడిన క్వారీ గుంతలు, ప్రమాదకరంగా మారిన నీటికుంటలు గుర్తించి ఉపాధి హామీ పథకంలో భాగంగా కుంటలు పూడ్చడమే కాకుండా, రక్షణ చర్యలు చేపట్టాలి. అప్పుడే ఇలాంటి దుర్ఘటనలకు కొంతైనా చెక్ పెట్టవచ్చు.

నేత్రదానం చేయాలి: కలెక్టర్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేసి అంధత్వ నివారణకు సహకరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టరును డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మరణాంతరం కళ్లు నశించిపోకుండా ఇద్దరికి కార్నియా అంధులకు చూపును ప్రసాదించాలని కోరారు. మరణించిన వ్యక్తి సమాచారాన్ని 6 గంటల్లోపు సమీపంలో ఉన్న కంటి సేకరణ కేంద్రానికి ఇస్తే వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారని తెలిపారు. నేత్రదానం కోసం నేత్ర బ్యాంక్ నెంబర్లు 9849903116, 964069229లకు సంప్రదించాలని కలెక్టర్ కోరారు. కార్యక్ర మంలో జేసీ బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జిల్లా అంధత్వ నివా రణ సంస్థ కార్యదర్శి డాక్టర్ సంధ్యారెడ్డి, కర్నూలు ఆర్‌ఈహెచ్ సూపరిం టెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సింధూ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అపోహలు వద్దు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నేత్రదానానికి ప్రజలు ముందుకు రావాలని, అపోహలు వద్దని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. జాతీయ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం కర్నూలు జీజీహెచ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేత్రదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా నేత్రదాతల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ వారం రోజులు ఆసుపత్రిలోని ప్రతి వార్డులో రోగులకు, బంధువులకు, సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ప్రజలు నేత్రదానంపై అపోహలు వీడాలని సూచించారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్లు సంపత్ కుమార్, హర్షద్ బాషా, కార్నియా రికవరీ టెక్నీషియన్లు గంగాధర్, నరేష్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో సీబీఐ స్పెషల్ జడ్జి


దర్శనానికి వచ్చిన సీబీఐ స్పెషల్ జడ్జి గజానన్ భట్

మంత్రాలయం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని సీబీఐ స్పెషల్ జడ్జి గజానన్ భట్ సోమవారం దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి మంత్రాలయంలో బసచేశారు. సోమవారం ఆలయ మర్యాదలతో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్ జడ్జికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జడ్జికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పుష్కరిణి, తుంగభద్ర కారిడార్, గురునివాస్‌ను పీఠాధిపతులతో కలిసి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వారి వెంట మంత్రాయం సీఐ రామాంజులు, ఎస్ఐ- శివాంజల్, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, వ్యాసరాజాచార్, అనంతపురాణిక్ ఉన్నారు.

శ్రీశైల దేవస్థానంలో శిథిలావస్థకు చేరిన భవనాల తొలగింపునకు చర్యలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం పరిధిలోని పెద్దసత్రం, పొన్నూరు సత్రం, శివసదనం భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. భవనాల నిర్దిష్ట ఆయుర్దాయ కాలపరిమితి కూడా ముగింపు దశకు చేరిందన్నారు. ఈ భవనాలు ప్రస్తుతం నివాసయోగ్యం కావని రహదారులు-భవనాలు, పంచాయతీరాజ్ శాఖల సాంకేతిక నిపుణులు సైతం తెలిపారన్నారు. కావున నివాసుల భద్రత దృష్ట్యా ఈ భవనాలలోని నివాసితులందరినీ ఖాళీ చేయించి భవనాలను తొలగించాలని నిర్ణయించామన్నారు. ఈ మూడు భవనాలలోని నివాసితులందరూ ఒక నెల లోపు ఖాళీ చేయాలని లిఖితపూర్వకమైన నోటీసులు కూడా ఇస్తున్నామని ఈవో తెలిపారు.

శ్రీశైల భ్రమరాంబకు బంగారు హారాలు బహూకరణ

నంద్యాల కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారికి సోమవారం నెల్లూరుకు చెందిన అచ్యుత వెంకట సాయి మాధవ శశాంక్ తన కుటుంబ సభ్యులతో కలిసి మూడు బంగారు హారాలను సమర్పించారు. పగడాలు, ముత్యాలు, కెంపులు, పచ్చలతో కూడిన ఈ మూడు బంగారు హారాలు మొత్తం 232 గ్రాముల బరువు ఉన్నాయని ఆలయ అధికారులు తెలిపారు. వీటిలో ఒక హారం బరువు 78గ్రాములు, రెండో హారం 79 గ్రాములు, మూడో హారం 75 గ్రాములు ఉన్నాయన్నారు. దాతలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఈ హారాలను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావుకు అందజేశారు. అనంతరం సహాయ కార్యనిర్వహణాధికారి స్వాములు, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున దాతలకు వేదాశీర్వచనంతో పాటు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

- కలెక్టర్ రాజకుమారి పిలుపు
- మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్ వద్ద సోమవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2500 మట్టి విగ్రహాలను సోమవారం కలెక్టర్ ప్రజలకు పంపిణీ చేశారు. ముందుగా శాస్త్రోక్తంగా వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సహజ రంగులతో తయారు చేసిన మట్టి వినాయకుడి విగ్రహాలను వాడి పండుగను పర్యావరణానికి అనుకూలంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. చెరువులు, జలవనరులకు నష్టం కల్గించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గించుకుందామన్నారు. అనంతరం క్లాత్ బ్యాగుతో పాటు మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి నేటితో ముగియనున్న రిజిస్ట్రేషన్ గడువు

కర్నూలు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలోని క్యాంపస్ డిగ్రీ కాలేజీలో నాలుగేళ్ల ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ గడువు మంగళవారం ముగుస్తుందని రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్సు), బీఎస్సీ (హార్టికల్చర్) కోర్సుల్లో చేరడానికి ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతి కోర్సులో 50 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వర్తిస్తాయని, వర్సిటీ ప్రాంగణంలోనే విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్ల కాపీలతో పాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, రిజిస్ట్రేషన్ ఫీజ్‌తో పాటు ఐడీ, ఆధార్‌తో లింకు అయిన సెల్‌ఫోన్ నెంబర్ తీసుకువస్తే ఆయా విభాగాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

50 రోజులుగా...

- ప్రాచీన పద్ధతుల్లో మండపాల మరమ్మతులు
- మల్లన్న సన్నిధిలో అధికారుల పర్యవేక్షణ

నంద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని పరివార (సాలు) మండపాలు, ఆలయాల్లో పైకప్పు, లీకేజీ మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. గత 50 రోజులుగా ప్రాచీన పద్ధతిలో ఈ పనులు జరుగుతున్నాయి. భారతీయ ప్రాచీన నిర్మాణ పద్ధతులను అనుసరించి లైవ్ మోటర్ పద్ధతి(సునపుగార) మరమ్మతు చేయాలని ఆలయ అర్చకులు, అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ పనులు చేపట్టేందుకు పూణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్ట్ సంస్థ ముందుకొచ్చింది. దీంతో రెండు నెలల కిందట ట్రస్ట్ ప్రతినిధులు ఆలయంలో పర్యటించారు. రూ.5కోట్లు ఖర్చు అవుతుందని ట్రస్టు ప్రతినిధులు అంచనాకు వచ్చారు. అనంతరం స్వచ్ఛందంగా పనులను చేపట్టారు.


శుభ్రం చేస్తున్న కార్మికులు

ప్రధానంగా శ్రీశైలంలోని కుడి, ఎడమ సాలు మండపాలు, స్వామి వారి వెనుక భాగంలో ఉన్న శివాలయం, ఉప ఆలయాలు, ఉమామహేశ్వర స్వామి మండపాలతో పాటు లడ్డుపోటు మండపం.. సహస్ర దీపారాధన మండపం, లడ్డుపోటు దేవాలయం వెనుక, వీర శిరోమండపం తదితర మండపాలు పరంగా.. 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన సదరు ఆలయాల్లో పనులకు శ్రీకారం చుట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 50 రోజుల నుంచి పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే 24 వేల చదరపు అడుగుల్లో పనులు వేగవంతంగా చేపట్టారు.


పనుల్లో నిమగ్నమైన కార్మికులు

ప్రాచీన పద్ధతిలో ఇలా... వేల సంవత్సరాల కిందట జరిగిన ప్రాచీన పద్ధతుల రూపంలో మిశ్రమాన్ని చేసి నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. లైవ్ మోటర్ పద్ధతి(సున్నపు గార)లో కరక్కాయపొడి, సున్నం, ఇసుక, మారేడు, బెల్లం, కాల్చిన మట్టి, ఇటుక ముక్కలు, ఇటుకల పొడితో పాటు ఆరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న బంకను వాడుతున్నారు. ఈ మిశ్రమాన్ని వేర్వేరుగా పురాతన పద్ధతిలో కొన్ని రోజుల పాటు తొట్టిల్లో నానబెట్టి మిశ్రమాన్ని సిద్ధం చేస్తారు. ఈ పద్ధతిలో జరిగే నిర్మాణాలు 200 ఏళ్ల పాటు చెక్కుచెదరవని ట్రస్టు నిర్వాహకులు చెబుతున్నారు.

నేడు నంద్యాల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం

- హాజరుకానున్న మంత్రులు, త్రిసభ్య కమిటీ సభ్యులు
- ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరణ

నంద్యాల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నంద్యాల పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి త్రిసభ్య కమిటీ సభ్యులు మాజీ మంత్రి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని, ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్, పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పూల నాగరాజుతో పాటు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ సైతం హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, పలు అనుబంధ, పార్లమెంట్ కమిటీ, తదితర వాటికి ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. ఈ నేపథ్యంలో నేడు నంద్యాల పట్టణంలో టీడీపీ శ్రేణులు, నాయకులతో సందడి వాతావరణం నెలకొననుంది. మరీ మొత్తంగా ఆశావహుల్లో ఉత్కంఠ రేపినట్లైంది.

మాదే శ్రీశైలం..!

- ఉమ్మడి కర్నూలు జిల్లావాసుల మనోగతం
- మార్కాపురంలోకి చేర్చాలంటూ ప్రచారం..!
- శ్రీశైలాన్ని కాపాడుకుంటాం : ఎమ్మెల్యే బుడ్డా



శ్రీశైల దేవస్థానం

ఆత్మకూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పలు కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు జిల్లాలు, నియోజకవర్గాల సరిహద్దులను మార్పు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అయితే దేశంలోనే మరెక్కడా లేనివిధంగా ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలు కొలువై అత్యంత విశిష్టత కలిగిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీశైలాన్ని కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లాలోకి చేర్చాలన్న ప్రచారం తెరపైకి వస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాతో శ్రీశైలానికి ఆధ్యాత్మిక, చారిత్రాత్మక, భౌగోళిక అంశాలతో విడదీయరాని అనుబంధం ఉంది. అంతేకాదు.. పరిపాలనలో ఏలోటు రానివ్వకుండా శ్రీశైలం మండలాభివృద్ధికి ఇక్కడి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే సున్నిపెంట గ్రామాన్ని కూడా పంచాయతీ హోదా కల్పించి అక్కడి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నారు.

బ్రిటీష్ హయంలో 1808లో మద్రాస్ ప్రెసిడెన్సీ పరిధిలో రాయలసీమలోని కొంత ప్రాంతాన్ని కర్నూలు జిల్లాగా ఏర్పాటు చేశారు. అప్పట్లో శ్రీశైలాన్ని కూడా ఇదే జిల్లాలో ఉంచారు. తర్వాత 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైన సందర్భంలో కర్నూలును రాష్ట్ర రాజధానీగా ప్రకటించారు. మళ్లీ 1956లో జరిగిన రాష్ట్రాల పునర్విభజన చట్టంలో భాగంగా కర్నూలు జిల్లాలో ఉన్న బళ్లారి ప్రాంతంలో కన్నడ భాషా కలిగిన జనాభా ఎక్కువగా ఉండటంతో భాషా ప్రయుక్తంలో భాగంగా అప్పటి మైసూర్ రాష్ట్రం (ఇప్పటి కర్నాటక)లో కలిపారు. ఆ తర్వాత 1970 ఫిబ్రవరి 2వ తేదిన గుంటూరు నుంచి ఒంగోలు, కందుకూరు, చీరాల, అద్దంకి, నెల్లూరు జిల్లా నుంచి కనిగిరి, దర్శి, కర్నూలు జిల్లా నుంచి మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం నియోజకవర్గాలతో కలిసి ఒంగోలు జిల్లా కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1972 డిసెంబర్ 5వ స్వాతంత్ర సమరయోధుడు టంగుటూరు ప్రకాశం పంతులు పేరిట ప్రకాశం జిల్లాగా మార్చడం జరిగింది. ప్రకాశం జిల్లా ఏర్పాటు సమయంలో కూడా శ్రీశైలం భౌగోళికంగా దగ్గరగా ఉండటంతో కర్నూలు జిల్లాలోనే ఉంచారు. ఇందులో భాగంగానే శ్రీశైలం ప్రాంతాన్ని ప్రస్తుత ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం రెవెన్యూ గ్రామం పరిధిలోకి చేర్చి పరిపాలన సాగించినట్లు తెలిసింది. ఈక్రమంలోనే ప్రస్తుతం శ్రీశైలం ప్రత్యేక మండలంగా ఏర్పాటైనప్పటికీ పరిపాలన ఆత్మకూరు మండలాధికారులే చూసుకోవడం గమనార్హం. అందుకే ఆత్మకూరు నియోజకవర్గం పేరును సైతం ఏకంగా శ్రీశైలంగా మార్చారు. అయితే ప్రస్తుతం కొత్తగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలో శ్రీశైలాన్ని చేర్చాలన్న కొందరి ప్రతిపాదన ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల సెంటిమెంట్లను దెబ్బతీసేలా ఉందని చెప్పవచ్చు.

శ్రీశైలాన్ని కాపాడుకుంటాం

ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న శ్రీశైలాన్ని కాపాడుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలిగిన శ్రీశైలాన్ని వదులుకోమని అవసరమైతే రాజకీయాలకు అతీతంగా అడుగులు వేస్తామన్నారు.

- బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్యే


శ్రీశైలం ఏరియల్ వ్యూ


సున్నిపెంట గ్రామం

నత్తనడకన రైల్వేస్టేషన్ పునరుద్ధరణ..!

- కర్నూలు సిటీ స్టేషన్ పునరుద్ధరణకు రూ.42.62 కోట్లు
- 8 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం
- రెండేళ్లు గడిచినా కానరాని పురోగతి
- పనులను పరిశీలించిన చీఫ్ జనరల్ ఇంజనీరు రెహమాన్


అసంపూర్తిగా ముఖద్వారం పనులు

కర్నూలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ (రీ మోడలింగ్) పనులు ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం. పనుల్లో నిర్లక్ష్యం.. జాప్యం కారణంగా రెండేళ్లు పూర్తయినా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తి చేస్తారో స్పష్టత లేదు. అమృత్ భారత్ స్టేషన్ కింద కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ ఎంపిక చేశారు. రూ.42.62కోట్లతో స్టేషన్ పునరుద్ధరణ, పడమర (వెంకటరమణ కాలనీ) వైపు రెండవ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) నిర్మాణాల పనులు చేపట్టారు. గడువు దాటినా పూర్తికాకపోవడం, పనుల్లో జాప్యం వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. పనుల పురోగతిలో వేగం పెరిగేనా..? డిసెంబరు ఆఖరులోగా కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నూతన అంగులు రూపుదాల్చేనా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనుల్లో పురోగతి నత్తతో పోటీ పడుతోంది. 2019లో రూ.28 కోట్లతో స్టేషన్ రూపురేఖలు మార్చారు. స్టేషన్ ముఖ ద్వారా అధునికీకరణ, స్టేషన్‌లో పచ్చదనం, వాహనాల పార్కింగ్, ప్లాట్ ఫారం పునరుద్ధరణ, టికెట్ కౌంటర్, ప్రయాణికులకు విశ్రాంతి గదులు, స్టేషన్ ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు.. వంటి పనులు చేపట్టారు. ప్రజాదరణ కలిగిన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం ఎంపిక చేసి ఆ స్టేషన్ల పునరు ద్ధరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 2023లో రూ.42.62 కోట్లతో అదే ఏడాది ఆగస్టు 5న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా శంకు స్థాపన చేశారు. 8 నెలల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యం. తూర్పు వైపున ప్రధాన ద్వారం, స్టేషన్ పునరుద్ధరణతో పాటు ప్రయాణీకుల సౌకర్యం కోసం పడమర వైపు రెండవ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్), టికెట్ కౌంటర్ నిర్మాణాలతో పాటు తూర్పు, పడమర ఎంట్రీ గేట్లను కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, రైల్వే ప్రమాణికులు వివిధ ప్లాట్ ఫారంలో దిగేందుకు లిఫ్టులు, ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేయాలి. అయితే.. రెండేళ్లు గడిచినా 50 శాతం కూడా పనులు పూర్తికాలేదు.

ఎన్నో ఏళ్ల స్వప్నం.. సాకారంలో జాప్యం..

పడమర వైపున వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, లేబర్ కాలనీ, సంతోష్ నగర్, బాలాజీ నగర్, కప్పలనగర్.. వంటి కాలనీలు విస్తరించాయి. ఆ దిశగా నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. ఆయా కాలనీల ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకోవాలంటే అశోక్‌నగర్ దగ్గర రైల్వే లైన్ అండర్ బిడ్జి దిగువ నుంచి లేదంటే ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఐదు రోడ్ల కూడలి మీదుగా రావాలి. వర్షం వస్తే రైల్వే లైన్ అండర్ బిడ్జిలో వర్షపు నీరు నిండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ పడమర వైపు (వెంకటరమణ కాలనీ) రెండవ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) ఏర్పాటు చేయాలనే డిమాండ్ పాతికేళ్లుగా ఉంది. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం ద్వారా స్వప్నం సాకారం అవుతుందని ఆశిస్తే, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనుల్లో పురోగతి లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

పనులను పరిశీలించిన చీఫ్ జనరల్ ఇంజనీర్..

కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ, సెకండ్ ఎంట్రీ గేట్ నిర్మాణం పనులను సోమవారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ చీఫ్ జనరల్ ఇంజనీరు రెహమాన్ పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదనల మేరకు నిర్మాణాలు చేస్తున్నారా.. లేదా..? అంటూ పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీనియర్ సెక్షన్ ఇంజనీరు (ఎస్ఎస్ఈ) సత్యనారయణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఇంజనీర్లు ఉన్నారు. దీనిపై మహబూబ్ నగర్ ఎస్ఎస్ఈ సత్యనారయణ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా ఈ ఏడాది డిసెంబరు ఆఖరు వరకు గడువు పొగడిం చామని తెలిపారు. ఆలోగా పనులు పూర్తి చేసి కర్నూలు రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చేస్తామని తెలిపారు.


నిలిచిపోయిన రెండో గేటు పనులు

ఒరిజినల్ సర్టిఫికెట్లు కాలిపోయాయి

- ఉద్యోగం నష్టపోకుండా చూడాలి
- ఎస్జీటీ పోస్టుకు ఎంపికైన మధు ఆవేదన



దగ్ధమైన ఒరిజనల్ సర్టిఫికెట్లు, బాధితుడు మధు

అవుకు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో సోమవారం ఉదయం తమ ఇంట్లో జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల సరిఫికెట్లు కాలిపోయాయని ఆ గ్రామానికి చెందిన మధు వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మధు ఎస్జీటీ పోస్టు సాధించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంది. అయితే ఇంతలోనే సర్టిఫికెట్లు కాలిపోయాయని బోరున విలపిస్తూ మధు రెవెన్యూ, పోలీస్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్ఐ వెంగళరెడ్డి, వీఆర్వో సుబ్బరాయుడు, పంచాయతీ సెక్రటరీ మధుసుధాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో మధు 80.53 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 773 ర్యాంకును సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యారు. వెరిఫికేషన్ కోసం సర్టిఫికెట్లను సిద్ధం చేసుకొని ఫ్రిజ్ పక్కన ఉంచానని, అయితే షార్ట్ సర్క్యూట్ వల్ల ఫ్రిడ్జ్ నుంచి మంటలు వ్యాపించి ధ్రువీకరణ పత్రాలు కాలిపోయాయని లబోదిబోమన్నారు. సర్టిఫికెట్లు పొందాలంటే సమయం పడుతుందని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ఉద్యోగం నష్టపోకుండా చూడాలని కోరారు.

స్నేహితులను బలితీసుకున్న రోడ్డు

- చికిత్స పొందుతూ యువకుల మృతి



మాబు సుభాన్, రాజేశ్ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్/మంత్రాలయం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి సమీపంలో కారు, బైకు ఢీకొన్న ఘటనలో గాయపడిన స్నేహితులు రాజేశ్(29), మాబు సుభాన్(29) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. మంత్రాలయానికి చెందిన రాజేశ్, మాబు సుభాన్ స్నేహితులు. మాబు సుభాన్‌కు సాఫ్ట్‌వేర్ కంపెనీలో సోమవారం ఇంటర్వ్యూ ఉండడంతో చెన్నైకి బయలుదేరడం కోసం ఆదోని రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. మాబు సుభాన్‌ను డ్రాప్ చేయడం కోసం అతడి స్నేహితుడు రాజేశ్ వచ్చాడు. అయితే ఇంటర్వ్యూ క్యాన్సిల్ అయిందని సమాచారం అందడంతో వారిద్దరూ మంత్రాలయానికి తిరుగు పయనమయ్యారు. అయితే బనవాసి సమీపంలో వీరు బైకు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజేష్, మాబు సుభాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. రూరల్ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఒకరు..


రాఘవేంద్ర(ఫైల్)

మంత్రాలయం: మంత్రాలయానికి చెందిన నేసే రాఘవేంద్ర (24) శనివారం అమావాస్య నేపథ్యంలో ఉరుకుంద పుణ్యక్షేత్రానికి మోటారు సైకిల్‌పై బయలుదేరారు. కుప్పగల్లు దగ్గర బైకు అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరుకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ నుంచి పడి వృద్ధుడు..


స్వాములు(ఫైల్)

నందికొట్కూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం పాలెం చెందిన కాటేపోగు స్వాములు(62) ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందారు. వివరాలివీ.. వడ్డేపేటలోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో కాలువ పనులు జరుగుతున్నాయి. సిమెంట్ బస్తాలను దించేందుకు స్వాములు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో అక్కడికక్కడే స్వాములు మృతి చెందారు. ఆయన భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కమల్ కుమార్(39 అక్కడిక్కడే మృతి చెందారు. కమల్ కుమార్ ఐస్‌క్రీమ్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేవారు. సోమవారం ఐస్‌క్రీమ్‌లు అమ్ములు కొని ఇంటికి వెళ్తుండగా పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డి నగర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కమల్ కుమార్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్‌బాబు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

వెల్దుర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి కోర్టు జైలుశిక్ష విధించింది. ఎస్ఐ అశోక్ తెలిపిన మేరకు.. మండలంలోని బోగోలు గ్రామానికి చెందిన చిన్నగోపాల్ ఈ నెల 21న మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి, సోమవారం డోన్ జ్యూడిషియల్ ఫస్టు క్లాసు కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రూ.10వేల జరిమానా లేక 7 రోజుల జైలు శిక్ష విధించారు. నిందితుడు జరిమానా కట్టలేనని జైలుకు వెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్‌చార్జి జీపీగా షాబుద్దీన్



కర్నూలు లీగల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కోర్టు ఇన్‌చార్జి గవర్నమెంటు ప్లీడర్‌గా ఏజీపీ సయ్యద్ షాబుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంతవరకు ఈజీపీగా ఉన్న ఆనందరావు స్థానంలో సయ్యద్ షాబుద్దీన్ నియమితులయ్యారు. సయ్యద్ షాబుద్దీన్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కొనసాగుతూ ఇన్‌చార్జి గవర్నమెంటు ప్లీడర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు ఈ అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ప్రభుత్వం తన ఆదేశాలలో పేర్కొంది.

మత్తుకు బానిస కావద్దు

తుగ్గలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చదువుకోవాలని జొన్నగిరి ఎస్ఐ మల్లిఖార్జున, ఏఎస్‌డబ్ల్యూవో బాబు సూచించారు. సోమవారం జొన్నగిరి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు మత్తుపదార్థాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే చెడు అలవాట్లకు ఉండాలన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఓర్వకల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 2025 మెగా డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న శ్రీనివాస బీ.ఎడ్, రాఘవేంద్ర బీ.ఎడ్ కళాశాలల్లో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. డీఎస్సీ వెరిఫికేషన్ కేంద్రాలకు ధ్రువపత్రాల పరిశీలన కోసం హాజరయ్యే అభ్యర్థులకు ఏ చిన్న సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ఇంటర్నెట్, విద్యుత్ సదుపాయాలకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ కీలకమైనదని, క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సబ్జెక్టు వారీగా ఏర్పాటు చేసిన గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాల్లో ఎంత మంది అభ్యర్థులు హాజరుకానున్నారని అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో వచ్చే ఇబ్బందులు, వాటిని ఎలా అధిగమించాలనే విషయాలపై కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచనలు చేశారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ విజయవంతంగా పూర్తయ్యేలా ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 2,600 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం 54 బృందాలతో పాటు అదనంగా మరికొన్ని బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కలెక్టర్‌కు వివరించారు. వెరిఫికేషన్‌కు ఏ క్షణాన ఆదేశాలు అందినా వెంటనే నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల డీఈవోలు శామ్యూల్ పాల్, జనార్ధన్‌రెడ్డి, డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కర్నూలు క్రైమ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామక ప్రక్రియలో భాగంగా నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది. ఈ పరిశీలనకు మొత్తం 309 మంది సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులకు గానూ 297 మంది హాజరయ్యారు. అభ్యర్థుల విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రం, స్థానికత సర్టిఫికెట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థుల వద్ద నుంచి 3 సెట్ల అటెస్టేషన్ పత్రాలను తీసుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తున్నారన్నారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులను తదుపరి నియామక దశకు ఎంపిక చేస్తారని తెలిపారు. మంగళవారం 334 మంది ఏపీఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని ఆయన తెలిపారు. సివిల్ కానిస్టేబుళ్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఈరోజు హాజరు కాని మిగిలిన 12 మంది అభ్యర్థులకు, ఏపీఎస్పీ అభ్యర్థులతో పాటు మంగళవారం మాత్రమే అవకాశం కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణ మోహన్‌లు, ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, డీపీవో ఏవో ఎస్.విజయలక్ష్మి, ఆర్ఐలు, సూపరింటెండెంట్లు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

600 బస్తాల యూరియా విక్రయాలు నిలుపుదల

- ఉరుకుందా డిపోకు షోకాజ్ నోటీసు
- కోడుమూరులో జేడీఏ వరలక్ష్మి ఆకస్మిక తనిఖీలు


రికార్డులను తనిఖీ చేస్తున్న వరలక్ష్మి

కోడుమూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి సోమవారం కోడుమూరు పట్టణంలోని ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పట్టణంలోని ఉరుకుంద రైతు డిపోలో ఆమె దాడులు నిర్వహించారు. యూరియా స్టాక్‌కు, ఈ పాస్ మిషన్‌లో విక్రయాలకు పెద్ద ఎత్తున తేడా ఉండటంతో డిపో యాజమానిని ప్రశ్నించారు. స్టాక్ బోర్డులో ఎందుకు ధరలు పొందుపరచలేదని నిలదీశారు. ఇందుకు సరైన సమాధానం లేకపోవడం ప్రస్తుతం డిపోలో ఉన్న 600 బస్తాల యూరియా, అలాగే మరో 70 బస్తాల డీఏపీ విక్రయాలను నిలిపేశారు. అలాగే షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేకపోతే తగు చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కోడుమూరు మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ కొనుగోలు బహిష్కరణ

- సాయంత్రం 6 వరకు టెండర్లు దాఖలు చేయకుండా వ్యాపారుల దోబూచులాట
- గ్రేడింగ్ కొనసాగించాలంటూ వ్యాపారులు
- రైతులకు నష్టం కలిగించే విధానంపై ఉపేక్షించబోమన్న కార్యదర్శి
- మార్కెట్ కమిటీపైకి దూసుకొచ్చిన రైతులు
- మార్కెట్ కమిటీకి రెండు రోజులు సెలవు


వేరుశనగ వ్యాపారులతో చర్చిస్తున్న వన్‌టౌన్ సీఐ, తహసీల్దార్, కార్యదర్శి

ఆదోని అగ్రికల్చర్ , ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులను కొనుగోలు చేయకుండా సోమవారం వ్యాపారులు మొండికేశారు. పదివేల బస్తాలకు పైగా విక్రయానికి తీసుకొచ్చారు. రైతులు వేరుశనగ దిగుబడులను కమిషన్ ఏజెంట్ల దుకాణాల ముందు రాశులుగా టెండర్లకు ఉంచారు. 25వ తేదీ నుంచి వ్యాపారులు మహిళా కూలీలతో పాసింగ్ చేస్తే ఉపేక్షించమని మార్కెట్ యార్డు అధికారులు ముందుగానే హెచ్చరించారు. ఉదయం 11 గంటలకు రాశులుగా పోసిన వేరుశనగ పాసింగ్ లేకుండానే టెండర్లను కోట్ చేసుకుంటూ వెళ్లారు. వేరుశనగ వ్యాపారుల సంఘం నాయకులు కొంతమంది టెండర్ వేస్తున్న వ్యాపారులను వేయకుండా ఫోన్ ద్వారా హెచ్చరించారు. వ్యాపారులు టెండర్ వేస్తున్నారని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. టెండర్లో పాల్గొన్న వ్యాపారులంతా మార్కెట్ కమిటీ టెండర్ హాలులో ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు చేయకుండా టెండర్ ఫారాలను వారి జాబిలో పెట్టుకొని ఇంటికి వెళ్లిపోయారు. నాలుగు గంటల వరకు వారు కంప్యూటర్ రూమ్‌లకు రాకపోవ డంతో అధికారులు వెంటనే అప్రమత్తమై వేరుశనగ వ్యాపారులతో మాట్లాడారు. పాసింగ్ విధానం ఉంటేనే తాము టెండర్ దాఖలు చేస్తామని, లేకపోతే చేయలేమంటూ తెగేసి చెప్పారు. రైతులకు నష్టం కలిగించే ఈ విధానంపై ఉపేక్షించమని వ్యాపారులను మార్కెట్ యార్డ్ కార్యదర్శి హెచ్చరించారు. సాయంత్రం కావస్తుండడంతో రైతులు ఒక్కసారిగా కమిషన్ ఏజెంట్లపై కొనుగోలు చేస్తారా లేదా అంటూ ఒత్తిడి పెంచారు. వారు మార్కెట్ కమిటీపై ఒక్కసారిగా దూసుకొచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని వ్యాపారులతో చర్చిస్తున్నామని, మీ వేరుశనగ దిగుబడి వద్దకు వెళ్లాలని సూచించారు. ఈ విషయం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దృష్టికి మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన, సహాయ కార్యదర్శి శాంతకుమార్ తీసుకెళ్లారు. కార్యాలయానికి రావాలని ఆయన తెలపడంతో హుటాహుటిన కమిషన్ ఏజెంట్లు, అధికారులు పరుగులు పెట్టారు.

సబ్ కలెక్టర్ వెంటనే వన్‌టౌన్ సీఐ శ్రీరామును, తహసీల్దార్ రమేష్‌ను మార్కెట్ కమిటీకి వెళ్లి వ్యాపారులతో మాట్లాడి టెండర్లు జరిపే విధంగా చూడాలని సూచించారు. ఎంతసేపటికీ వారు ఒప్పుకోకపోవడంతో ఇలాగే కొనసాగితే లైసెన్స్ రద్దు చేస్తామని, రైతులకు ఇబ్బంది కలిగించకుండా వెంటనే టెండర్లు వేయాలని కోరడంలో ఈ ఒక్క రోజే తాము టెండర్లు వేసి కొనుగోలు చేస్తామని అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది. సాయంత్రం ఏడు గంటల వరకు టెండర్లు వేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజులపాటు మార్కెట్ కమిటీకి వేరుశనగ దిగుబళ్లను విక్రయానికి తీసుకురావద్దని మార్కెట్ కమిటీ కార్యదర్శి కల్పన తెలిపారు. రైతులకు నష్టం కలిగించే పాసింగ్ విధానాన్ని ఉపేక్షించమని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పింఛన్లపై ఆందోళన వద్దు

- అర్హులు అప్పీల్ చేసుకునే అవకాశం : కలెక్టర్ రాజకుమారి



నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు పింఛన్ విషయంలో ఆందోళన వద్దని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు అందరూ ప్రభుత్వం నుంచి నోటీసులు ఇచ్చి డాక్టర్ల ఆధ్వర్యంలో రీ అసెస్‌మెంట్ ద్వారా దాదాపు జీజీహెచ్‌లో రీ వెరిఫికేషన్ పూర్తి చేశామన్నారు. రీ వెరిఫికేషన్‌లో 40శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉన్నవారికి యథావిధిగా పింఛన్ పునరుద్ధరించామన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 40 శాతం కంటే తక్కువ దివ్యాంగత్వం ఉండి వయసు 60ఏళ్లు దాటిన దివ్యాంగులకు వృద్ధాప్య పింఛన్‌గా మార్పుచేసి కొనసాగిస్తామన్నారు. అర్హత ఉన్నప్పటికీ 40శాతం కంటే తక్కువ దివ్యాంగత్వం ఉన్నట్లు నోటీసులు అందుకున్న వారు మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో అప్పీల్ చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. హెల్త్ పింఛన్లకు సంబంధించి ప్రభుత్వ వైద్యులు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను రీ వెరిఫికేషన్ చేశారన్నారు. నిజమైన దివ్యాంగులకు పింఛన్ పోతుందనే భయం వద్దని, కచ్చితంగా దివ్యాంగుల పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భవిష్యత్తుకు భరోసా చంద్రబాబు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తు తరానికి భరోసా కల్పిస్తారని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. స్థానిక సంత మార్కెట్లో సోమవారం నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేర కు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో వైఎస్ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు.. కోడుమూరు ప్రజలకు తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ నిచ్చారు. అనంతరం మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నారా లోకేశ్ చిత్రపటాలకు మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, బలరాం, గంగాధర్, అయ్యప్ప, బాలకృష్ణ, కేశ రఘుబాబు, ఎస్ఐ డీవై స్వామి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సాయి ఉదయ్ మాట్లాడుతూ ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నగరంలో కేవీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతిని కల్పించాలన్నారు ఎమ్మిగనూరు, ఆలూరు మండలాల కేంద్రంలో ప్రభుత్వం బాలికల బీసీ ప్రీమెట్రిక్ సంక్షేమ వసతి గృహం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీడీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రంగప్ప, శ్రీనివాసులు, అంజి, విజయ్, అమర్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని 12వ వార్డు వడ్డెగేరిలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని సీపీఎం నగర నాయకులు చాంద్‌బాషా డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. చాంద్‌బాషా మాట్లాడుతూ వడ్డెగేరిలో డబరా గుంతలో చేస్తున్న పనులను మధ్యలో ఆపేశారన్నారు ఇప్ప టికి నాలుగు నెలలు అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా డ్రైనేజీలపై కొన్ని చోట్ల బండలు వేశారు.. మిగిలిన చోట్ల వేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండీ షరీఫ్, వేణు, సిద్దయ్య, దేవస్వామి పాల్గొన్నారు.

జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు తొలి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. సోమవారం సమితి నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు త్యాగరాజు, ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య, కన్వీనర్ జేవీ కృష్ణయ్య, గౌరవ సలహాదారు దామోదరం రాధాకృష్ణమూర్తి, నాయకులు నాగభూషణం, సీవీ వర్మ, రోషన్ ఆలీ, అజయ్‌కుమార్, టీడీపీ నాయకుడు వెంకటరమణ, కాంగ్రెస్ నాయకుడు పోతుల శేఖర్, మల్లికార్జున, గోవర్ధన్ పాల్గొన్నారు.

జాబు కార్డుకు డబ్బులు డిమాండ్

సి.బెళగల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జాబు కార్డుకు ఉపాధి సిబ్బంది రూ.500 డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఉపాధి కూలీలు ఆరోపించారు. మండలంలోని పోలకల్లు, ఇనగండ్ల, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, బ్యాతోలి తదితర గ్రామాల్లో ఉమ్మడి జాబుకార్డులో నుంచి తొలగించాలని కొత్తగా వివాహం చేసుకున్న ఉపాధి కూలీలు కొత్త జాబుకార్డు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఉపాధి సిబ్బంది జాబ్ కార్డు కావాలంటే రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీవో కు ఆయా గ్రామాల ఉపాధి కూలీలు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై ఎంపీడీవో రాణెమ్మ వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, ఆయా గ్రామాలకు వెళ్లి విచారిస్తామని చెప్పారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, క్వింటం రూ.2వేలు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉల్లిమార్కెట్‌ను ఆయన పరిశీలించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఉల్లి మార్కెట్లో ధర చాలా ఘోరంగా ఉందని, రైతులకు ఏ మాత్రం కూడా గిట్టుబాటు కావడము లేదన్నారు. గోనెగండ్ల, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు క్వింటం కేవలం రూ.500 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఎకరాకు సుమారు రూ.లక్ష పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, క్వింటాం రూ.500 ఇస్తే రైతుకు ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, రైతులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి: ఐఎన్‌టీయూసీ

ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఖాద్రిపాష, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం, కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ సాంబశివుడు, జిల్లా అధ్యక్షుడు బతుకన్న డిమాండ్ చేశారు. సోమవారం వారు కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులకు అందుతున్న గిట్టుబాటు ధరను అడిగి తెలుసుకున్నారు. పాలకవర్గంతోపాటు కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని కలిశారు. ప్రస్తు తం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం ఉల్లి కేవలం రూ.400 మాత్రమే అందుతుందని, కనీసం రూ.2 వేలు మద్దతు ధర కల్పిం చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ లాజరసు, ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షుడు ప్రసాద్, సుంకన్న పాల్గొన్నారు.

సచివాలయంలో సమస్యలు పరిష్కరించే వారేరీ..?

సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ల ఆవేదన

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సమస్యలు పరిష్కరించేవారు కరువయ్యారని కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. సోమవారం కౌన్సిల్ హాలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశం మేయర్ బీవై.రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే వీధి కుక్కలను నియంత్రించాలన్నారు. పందిపాడు ఐఎంఎల్ డిపో వద్ద వీధిదీపాలు ఏర్పాటు చేయాలన్నారు. గుత్తి పెట్రోలు బంకు వద్ద పార్కింగ్ స్థలం, దుకాణాల వద్ద అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. 26వ వార్డులో మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని త్వరగా ప్రారంభించాలని కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. కల్లూరు ఎస్టేట్ నుంచి లక్ష్మీపురం వరకు డివైడర్లు ఏర్పాటు చేయాలని, లక్ష్మీపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ నారాయణరెడ్డి కోరారు. కోడుమూరు రోడ్డులోని వై.జంక్షన్ అభివృద్ధి కోసం రూ.54 లక్షలు మంజూరైనా నేటికీ టెండర్లు పిలవలేదని కో ఆప్షన్ సభ్యుడు క్రిష్ణమూర్తి అన్నారు. నగరంలో పారిశుద్యం మెరుగు నకు కార్మికుల సంఖ్యను పెంచాలని 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి కోరారు. మూడో వార్డులో పొట్టిశ్రీరాములు పాఠశాల నిర్మాణం ఎప్పుడూ పూర్తి చేస్తారన్నారు. సచివాలయంలో ఉద్యోగులు ప్రజలకు సక్రమంగా సేవలందించడం లేదని 4వ వార్డు, 43వ వార్డు కార్పొరేటర్లు ఆర్షియా పర్వీన్, మునెమ్మ ఆరోపించారు. నగర పాలకకు సంబంధించి విద్యుత్ శాఖ సిబ్బంది సంఖ్యను పెంచాలని 7వ వార్డు కార్పొరేటర్ జుబేర్ అహ్మద్ కోరారు.

● సర్వసభ్య సమావేశంలో అజెండాలో పొందుపరచిన 15 తీర్మానాలను ఆమోదించారు. రూ.4.06 కోట్ల విలువగల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. నగరంలో రహదారులు, డ్రైనేజీ పార్కులు, పైప్‌లైన్లు, మౌలిక వసతులకు తీర్మానాలను ఆమోదించారు.

ప్రజాప్రతినిధులకు సహకరించాలి: మేయర్



అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించాలని నగర మేయర్ బీవై రామయ్య కోరారు. అన్ని వార్డులకు ఒకే విధంగా నిధులు కేటాయించాలని, తక్షణమే కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు.

16 వార్డులకు నిధులు కేటాయించండి : ఎమ్మెల్యే గౌరు చరిత



నగర పాలక పరిధిలోని కల్లూరు 16 వార్డులకు నిధులు కేటాయిం చాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందన్నారు. 25 కొత్త వెంచర్ల నుంచి నగర పాలక సంస్థ పన్ను వసూలు చేస్తున్నా ఆ వెంచర్లలో కనీస వసతులు ఎందుకు కల్పించడం లేదని అన్నారు. భూమి పూజ అనంతరం కొందరు కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని, వై.జంక్షన్‌లో ఛత్రపతి శివాజి విగ్రహం ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. తుంగభద్ర డ్యాంకు మరమ్మతులు చేస్తున్న తరుణంలో వేసవిలో నగరానికి నీటి సమస్య వచ్చే అవకాశం ఉన్నందున హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి 350 క్యూసెక్కుల నీటిని కేటాయించేలా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతాం: కమిషనర్

నగరంలో పనులు దక్కించుకుని పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని నగర కమిషనర్ విశ్వనాథ్ అన్నారు. కుక్కల నియంత్రణ కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేసామని, పందులు, పశువులను తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి వార్డుకు నిధులు కేటాయిస్తాని, వినాయక చవితికి అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి: టీడీపీ కార్పొరేటర్

నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కేసీ కెనాల్‌కు ఇనుప కంచె ఏర్పాటు చేయాలని 17వ వార్డు టీడీపీ కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి కోరారు. కొత్త అయ్యప్పస్వామి గుడి నుంచి జొహరాపురం వరకు కేసీ కెనాల్‌పై రోడ్డు మరమ్మతులు చేపట్టాలన్నారు. మరికొందరు కార్పొరేటర్లు మాట్లాడుతూ చిన్నపార్కులో ఎంట్రీ ఫీజును రద్దు చేయాలన్నారు.

ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి. హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఓలు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యం తప్పనిసరి



జ్యోతి ప్రజల్వన చేస్తున్న జి.పుల్లయ్య, డాక్టర్ ఈఎస్ చక్రవర్తి, జీవీఎం మోహన్‌కుమార్ తదితరులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యక్తిగత, వృత్తిపర నైపుణ్యం తప్పనిసరి అని ఆమ్‌డాక్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఈఎస్ చక్రవర్తి అన్నారు. సోమవారం నగర శివారులోని అటానమస్ కళాశాలలు జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన ప్రథమ సంవత్సరం బీటెక్, ఎండీఏ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యలోని అన్ని బ్రాంచీల విలీనం సరికొత్త ఆవిష్కరణలకు తెర తీస్తుందన్నారు. కళాశాలల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య మాట్లాడుతూ తమ కళాశా లపై అపార నమ్మకంతో ఇక్కడ చేరిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రు లకు శుభా కాంక్షలు తెలిపారు. కళాశాలల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ మాట్లాడుతూ నేడు చదువుతోపాటూ సంస్కారం కూడా విద్యార్థులకు నేర్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాలల సీఈవోలు జి.గోపీనాథ్, జి.వంశీధర్, ప్రిన్సిపాళ్లు సి.శ్రీనివాసరావు, కేఈ శ్రీనివాసమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా: కాటసాని

ఓర్వకల్లు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని హుస్సేనాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పాల మధు మోహన్ ఇంటిపై టీడీపీ శ్రేణులు ఆదివారం దాడి చేశారు. విషయం తెలుసుకున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నాయకులపై దాడులు అధికమయ్యాయన్నారు. కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ రంగనాథ్ గౌడ్, ఎంపీపీ తిప్పన్న, నాయకులు నాగ తిరుపాలు, పరమేశ్వర రెడ్డి, గుర్రాల చెన్నా రెడ్డి, గోపా రమణా రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కర్నూలు మండలం ఉల్చాల గ్రామ స్వచ్ఛ భారత్ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. సుధాకరప్ప మాట్లాడుతూ ఏడుగురు వాటర్ లైన్‌మెన్లు పని చేస్తున్నారని, వారికి నెలకు రూ.6వేలు మాత్రమే జీతం చెల్లిస్తున్నారన్నారు. ఒక్కో కార్మికుడికి ఏడు నెలల నుంచి 15 నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలాపీరా, తిమ్మప్ప, రాముడు, రంగన్న, మద్దిలేటి, నాగన్న పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని వెంకటరమణ కాలనీ, బాలాజీనగర్, రామలింగేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య తనిఖీదారులు నిత్యం క్షేత్రస్థాయిలో స్వచ్ఛత పనులను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, రాజు ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు

గూడూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గూడూరుతో పాటు పలు గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలు నిర్వహించేదుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా మండపాలను ముస్తాబు చేస్తున్నారు. కర్నూలు పట్టణం నుంచి గణేశ్ విగ్రహాలను గూడూరులోని మండపాలకు తీసుకుని వచ్చే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు.

ఉల్లి పంట పరిశీలన



ఉల్లి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి రామాంజినేయులు

సి.బెళగల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఉల్లిపంటను జిల్లా ఉద్యాన శాఖాధికారి రామాంజినేయులు, కోడుమూరు మదన్ మోహన్ సోమవారం పరిశీలించారు. ఉద్యాన శాఖాధికారి రామాంజినేయులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉల్లి పంట మొత్తం దెబ్బతిందన్నారు. పంటను రైతులు పొలంలోనే వదిలేశారన్నారు. ఆయన వెంట హార్టికల్చర్ అసిస్టెంట్లు అఫ్రీన్, విజయలక్ష్మి, ప్రవీణ్, హనీఫ్ ఉన్నారు.

విచారణ పారదర్శకంగా నిర్వహించాలి: ఏబీవీపీ



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ విద్యార్హతలపై విచారణ పారదర్శంగా నిర్వహించాలని ఏబీవీపీ కర్నూలు విభాగ కన్వీనర్ ఎర్రిస్వామి, లోకేశ్, రామాంజినేయులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు.

● ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న డీఈవో శామ్యూల్‌పాల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఓ ప్రైవేటు పాఠశాల ఎలాంటి అనుమతులు లేకుండా దేవనకొండ, గోనెగండ్ల, గూడూరు, సి.బెళగల్, నందవరం, మంత్రాలయంలలో ఏర్పాటు చేసుకుని, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

● జగన్నాథగట్టులో ఉన్న జర్నలిస్టుల స్థలాలకు మౌలిక వసతులను కల్పించాని ఏపీజేఎఫ్ సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ స్థలాలు ప్రభుత్వ రికార్డులలో తప్పుగా నమోదు చేశారని ఆరోపించారు. నాయకులు రామకృష్ణ, సాయి కుమార్ పాల్గొన్నారు.

● నగరంలోని నరసింహరెడ్డినగర్ రైల్ స్టేషన్ కూడలిలో నెహ్రూ విగ్రహం ఏర్పాటు చేయాలని బతుకన్న, ప్రతాప్, రాజేంద్ర కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు.

● నగరంలోని ఎ, బీ, సీ క్యాంప్ క్వార్టర్స్‌లో అనధికారింగా నివాసం వున్న వారిని సెప్టెంబరు 8 లోగా ఖాళీ చేయించాలని ఆర్ అండ్ బీ ఎస్ఈ, మున్సిపాలిటీ, పోలీస్, విద్యుత్, రెవెన్యూ అధికారులను డీఆర్వో వెంకట నారాయణమ్మ ఆదేశించారు.

సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

కర్నూలు అర్బన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు బాధితులకు సూచించారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో గోనెగండ్లకు చెందిన మూలింటి హంపారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఎంపీ నాగారాజును సంప్రదించగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ. 41,018 మంజూరయ్యాయి. మేరకు ఎంపీ తన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితుడికి అందజేశారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం



మట్టి వినాయకుడి విగ్రహాన్ని అందజేస్తున్న పీవీ కిషోర్‌రెడ్డి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మట్టి వినా యకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు పీవీ కిషోర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని సి.క్యాంపు వద్ద టీటీడీ కల్యాణ మండపం ఎదుట ఏపీపీసీబీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పీవీ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ మట్టి విగ్రహాలతోపాటు, వేదిక, ఊరే గింపుల్లో భారీ శబ్దాలు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని కోరారు.

చేనేత భవన్‌ను ప్రారంభించాలి: సీపీఎం

కోడుమూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రారంభానికి నోచుకోని చేనేత భవనాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కోడుమూరుకు విచ్చేసిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకుడు గఫూర్‌మియా మాట్లాడుతూ కోడుమూరు పాతబస్టాండ్‌లో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ నిర్మించాలని, నిలిచిపోయిన ఉర్దూ స్కూల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. అలాగే మహిళా మార్టు పేరుతో పొదుపు మహిళ నుంచి వసూలు చేసిన డబ్బును వాళ్లకు తిరిగి ఇప్పించాలని ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక నిమజ్జనం కోసం విద్యుత్ అభివృద్ధి పనుల నేపథ్యంలో నేడు నగరంలోని పలు ప్రాంత్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ సోమవారం తెలిపారు. శ్రీనివాస నగర్, పెద్దమార్కెట్, బీక్యాంప్, సీక్యాంప్, వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, సీతారాం నగర్, బాబా బృందావన్ నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉలిందకొండలో రసాయనిక ఎరువుల దుకాణాలను ఆర్ఎస్కేల్లో మండల స్థాయి టీం సోమవారం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో అమ్మకాలు, నిల్వలకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. యూరియా నిల్వలను పరిశీలించారు. ఎరువుల ధరలను తప్పనిసరిగా నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో తహసీల్దార్ ఆంజనేయులు, వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ విజయ్‌రాజు, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: కమిషనర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారు లను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహిం చిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 24 అర్జీలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులన్నీ నిర్దేశిత గడువులోగా పరి ష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాషా, స్వర్ణలత పాల్గొన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు రాజామునెమ్మ డిమాండ్ చేశారు. సోమవారం వేదిక అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులతో కలిసి ఆందోళన చేశారు. రాజామునెమ్మ మాట్లాడుతూ ఎప్పటి నుంచో వస్తున్న పింఛన్లను తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం దారుణమ న్నారు. తగ్గించిన పర్సెంటేజీని పెంచి సంక్షేమ పథకాలను వర్తింపజే యాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గోపాల్, గౌరవ అధ్యక్షుడు ఆనం ద్‌బాబు, దివ్యాంగులు పాల్గొన్నారు.

● తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని వైసీపీ దివ్యాంగుల విభాగం నగర అధ్యక్షుడు పి.పాండురంగ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్వీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు దివ్యాంగులతో కలిసి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, బాధితులు

ఓర్వకల్లు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన దళితులు సాగు చేసుకుంటున్న భూముల్లో కంది పంటను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, బాధితులు లక్ష్మీదేవి, శంకరమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

ఆదోని జిల్లా ఏర్పాటుకు మద్దతివ్వాలి



నూర్ అహ్మద్

ఆదోని టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఏర్పాటుకు పార్టీలకతీతంగా మద్దతు ఇవ్వాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నూర్ అహ్మద్ కోరారు. సోమవారం మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్సీ మధుసూదన్, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మద్దతు తెలపడం పట్ల అభినందించారు. జిల్లా ఏర్పాటయితేఏ ఎక్కువ నిధులు వస్తాయని, ఫలితంగా డివిజన్‌లోని పశ్చిమ పల్లెలు అభివృద్ధి చెందుతాయన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తు ఏవో రవి

మద్దికెర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలని ఏవో రవి, ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కూరగాయలు ఆకుకూరల స్టాల్స్ పరిశీలించారు. క్రిమి సంహారకమందులు వాడకుండా పండించిన కూరగాయాలనే వాడాలని, మండలంలో దాదాపు 200ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నరన్నారు. వీఆర్వో రంగస్వామి, తదితరులు ఉన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి



వినతిప్రతం ఇస్తున్న సీపీఐ నాయకులు, కూలీలు

హాలహర్వి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉన్న 11వారాల ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలని కూలీలు, సీపీఐ నాయకులు మునిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కరువు ప్రాంతంలో పనిచేస్తున్న శ్రామికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు చెల్లించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అందక అవస్థలు పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన ఎంపీడీవో వరలక్ష్మి త్వరలోనే వేతనాలు ఖాతాల్లో జమ అయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో దర్నాను విరమించారు.

రహదారిని ఏర్పాటు చేయాలి



ఎంపీడీవో కు వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

దేవనకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీ నుంచి కర్నూలు-బళ్లారి రహదారి కొత్తపేట వరకు రోడ్డు వేయా లని జనసేన నాయకులు ఉచ్చీరప్ప కోరారు. ముళ్లపొదలతో రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. రామాంజనేయులు, ఈశ్వర్, బాలు, నరేష్, సతీష్ ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారం



కొళాయిని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గుండాల్ నాయక్

మద్దికెర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా పాఠశాలలో నీటి కష్టాలు పరిష్కరయ్యాయని తహసీల్దార్ గుండాల్‌నాయక్, ఎంపీడీవో సువర్ణలత అన్నారు. సోమవారంపాఠశాల ఎదురుగా మండల నిధులతో బోరు వేశారు, పుష్కలంగా నీరు పడటంతో పైపు లైను వేసి, కొళాయిని తహసీల్దార్ ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు బి.మురళిధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఉప సర్పంచు క్రిష్ణ, పంచాయతి సలహా దారులు ఆంజినేయులు, ఉన్నారు.

మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ● పట్టణంలో వేలాది మహిళలతో కలిసి విజయోత్సవ ర్యాలీ ● సూపర్ సిక్స్, సూపర్ హిట్ అంటూ మహిళల నినాదాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన మహిళలు

పత్తికొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను విజయవంతంగా అమలుచేయడంపై సూపర్‌సిక్స్..సూపర్‌హిట్ అంటూ మహిళలతో కలిసి సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. టీటీడీ కళ్యాణమండపం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీలో వేలాదిమంది మహిళలు పాల్గొని చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు.

అనంతరం అంబేడ్కర్ కూడలిలో ఎమ్మెల్యే శ్యాంబాబు ఎ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను నెరవేర్చి ఇచ్చినమాటకు కట్టుబడ్డ సీఎంగా చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్, తల్లికి వందనం, స్త్రీశక్తి పేరిట రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించారన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటుచేసుకున్న నష్టాన్ని భర్తీచేస్తూనే మరోవైపు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏడాదిలో చంద్రబాబు నెరవేర్చారని తెలిపారు. ఆయన నాయకత్వంలో రానున్న రోజుల్లో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాల జాబితాలో ముందువరుసలో నిలవనుందని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మహిళలకు ఆస్తిలో వాటా కల్పిస్తూ ఎన్టీఆర్ చట్టం తెచ్చారన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు నాటి ప్రభుత్వంలో సీం చంద్రబాబు పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మొదటి నుంచి టీడీపీ ఆడ పడుచులకు అండగా నిలుస్తూ, వారి అభివృద్ధి కోసం కృషి చేస్తోందని, ఈరోజు మహిళలు వేలాదిగా తరలివచ్చి విజయోత్సవ ర్యాలీలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మీ ఆదరాబిమానాలు టీడీపీకి ఎప్పుడు ఇలానే ఉండాలని ఆశిస్తున్నామన్నారు. అనంతరం ర్యాలీకి వచ్చిన మహిళలకు స్థానిక డిగ్రీకళాశాల ఆవరణలో భోజనం ఏర్పాటుచేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, రామానాయుడు, వెంకటపతి, తిమ్మయ్య చౌదరి, బత్తినిలోక్‌నాథ్, కడవల సుధాకర్, మహిళా నాయకురాళ్లు జానకమ్మ, ఈరమ్మతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మత సామరస్యం కలిగి ఉండాలి

● ఎస్పీ విక్రాంత్ పాటిల్
● ఆదోనిలో సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆదోని, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పండుగలను శాంతియుతంగా చేసుకుని, మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. సోమవారం ఆదోనిలోని మున్సిపల్ సమావేశ భవనంలో అధికారులు, మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ, సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు. 27న విగ్రహాలను ప్రతిష్టించిన అనంతరం నిర్వాహకులు పోలీసులు నిర్ణయించిన నియమాలను పాటించాలని కోరారు. డీజే సౌండ్ పరిమితికి మించి పెట్టవద్దని, గొడవలకు తావు లేకుండా శోభాయాత్ర నిర్వహించుకోవాలన్నారు. పోలీసులకు మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలని, సెల్‌ఫోన్ నంబర్లు ఉండాలన్నారు. 31న ఉదయం 10 గంటల నుంచే నిమజ్జనాన్ని ప్రారంభించి, రాత్రి 10 గంటల్లోగా ముగించాలన్నారు. అధికారులంతా తమ విధులను సక్రమంగా పూర్తి చేయాలన్నారు. ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ హేమలత, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, సభ్యులు విట్టా రమేష్, బసవన్నగౌడ్, కునిగిరి నీలకంఠ, ప్రతాప్, దేవిశెట్టి ప్రకాష్, జమీల్‌షఫీ ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ అధికారులు రూ.1.50 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ప్రింటర్లు, బీరువా, ఇతర సామాగ్రిని అందజేశారు.



సామగ్రి అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

కర్నూలు బ్రాంచ్ మేనేజర్ నవీన్ కుమార్, ఆదోని బ్రాంచ్ మేనేజన్ రాఘవేంద్ర రెడ్డి హెచ్ఎం గిరిబాబు, యూపీ హెచ్ఎం గంగానాయక్‌ను సన్మానించారు. రాకేష్, రఘు, ఉపాధా యులు శివకుమారి, కాంతమ్మ, పద్మావతి, సాల్మన్ పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ విరాళం

ఆదోని టౌన్ : పట్టణంలోని హనుమాన్ నగర్ కిల్చిన్ పేట పురపాలక పాఠశాలకు లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంక్ బీవోఎం చైర్మన్ రాయచోటి సుబ్బయ్య, కంప్యూటర్, ప్రింటర్ సోమవారం అందజేశారు. హెచ్ఎం ఉరుకుందప్ప, డైరెక్టర్లు లక్ష్మీనారాయణ శెట్టి, హుస్సేన్ అహమ్మద్, కేఆర్ శ్రీనివాసులు, విరుపాక్షి రెడ్డి, మేనేజర్ జుల్ఫీకర్, ఈశ్వర్, వీరచంద్ర యాదవ్, చంద్రకళ, మేరీ ఉన్నారు.

కపటి పాఠశాలకు కంప్యూటర్లు అందజేత

ఆదోని రూరల్: మండలం కపటి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఐడీబీబిఐ బ్యాంకు అధికారులు కంప్యూటర్లు అందజేశారు. గ్రామానికి చెందిన వాణి, ఆదోని శాఖలో అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె ప్రోత్సాహంతో జిల్లా మేనేజర్ నవీన్ కుమార్, ఆదోని మేనేజర్ రాఘవేంద్రరెడ్డి దాదాపు రూ.65వేలు విలువ చేసే కంప్యూటర్లు, టేబుల్స్, చేర్లను అందజేశారు. మాజీ ఎంపిటీసీ ఆదాం, బాలస్వామి ఉన్నారు.

పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటించాలి

ఆదోని రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దహరివాణం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం నాయకులు, గ్రామస్థులు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని కోరారు.

పింఛన్లను పునరుద్ధరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

ఆదోని రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని సంఘం నాయకులు దుగ్గయ్య, హనుమంతరెడ్డి, సీపీఎం నాయకుడు లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా అర్హుల పింఛన్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

తుగ్గలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఎస్‌డబ్ల్యూవో బాబు ఆదేశించారు. సోమవారం జొన్నగిరి ఎస్సీ హాస్టల్‌ను తనిఖీచేసి, స్టాకును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం సదుపాయాలు కల్పించిందని విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వార్డెన్ రమేశ్, సిబ్బంది ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పత్తికొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండగేరికి చెందిన కురువ ఈశ్వరమ్మ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల మేరకు.. సోమవారం ఉదయం పొలానికి వెళ్లి అక్కడే పురుగుమందుతాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబసభ్యులు పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమచికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. కాగా భర్త నాగరాజు ఏడాది క్రితమే మరణించగా కుమారుడు, కుమార్తెకు వివాహం చేసింది. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

వెల్దుర్తి విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు





విజయ్‌కుమార్, కార్తీక్

వెల్దుర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి గ్రామానికి చెందిన నాయకంటి విజయ్‌కుమార్, దాదిపోగు కార్తీక్‌బాబు ఎంబీబీఎస్‌లో సీటు సాధించారు. వివరాల మేరకు.. నీట్‌లో ర్యాంకు రావడంతో దాదిపోగు కార్తీక్‌బాబు కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, నాయ కంటి విజయ్‌కుమార్ అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉచిత ప్రవేశాన్ని పొందారు. తల్లిదండ్రులు నాయకంటి గిడ్డయ్య, తల్లి శివమ్మ, దాది పోగు నవీన్ సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన వాహనాల వేలం

ఆలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలను ఎస్ఐ మహబూబ్ బాషా వేలం వేశారు. సోమవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్వహించగా, 10 వాహనాట రూ.63,800 వచ్చినట్లు తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న లారీ



రైల్వే వంతెన వద్ద కూలిన స్తంభం

తుగ్గలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వే వంతెన వద్ద నున్న సేఫ్టీ స్తంభాన్ని లారీ ఢీ కొట్టడంతో పోల్ కూలింది. ఆ సమయంలో వాహనాలు, బాటసారులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా లారీ పత్తికొండ నుంచి వస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ పులిశేఖర్

తుగ్గలి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌గౌడ్ సూచిం చారు. సోమవారం జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు పోలీసుల, విద్యుత్ అధికారుల సూచనలు తప్పక పాటించాలని, ఘర్షణలు చోటుచేసు కుంటే నిర్వాహకులదే బాధ్యత హెచ్చరించారు. ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది ఉన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి

● ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వృద్ధుడి సమస్యను తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

ఆదోని, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో డివిజన్‌లోని మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సం బంధిత శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించా లన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌పీవో తిమ్మక్క, ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఈవో వెంకటరమ ణారెడ్డి, ఏవో రమాదేవి పాల్గొన్నారు.

అర్జీలలో కొన్ని..

తనకు ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామంలో సర్వేనంబర్ 129/ఏలో భూమి ఉందని, రీ సర్వే అనంతరం 50 సెంట్లు భూమి తక్కువగా చూపిస్తుందని, న్యాయం చేయాని ఎర్రకోట గ్రామానికి చెందిన చిన్నహనుమన్న అర్జీ ఇచ్చారు. పెద్దహరివాణంను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అర్జీ సమర్పించారు.4. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన రామచంద్ర తనకు సర్వేనంబర్ 321లో 2.18 ఎకరాల భూమి ఉందని సర్వే చేసి హద్దులు చూపాలని అర్జీ సమర్పించారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

దేవనకొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని మండల వైద్యాధికారి విజయ భాస్కర్ సూచించారు. సోమవారం వైద్యాశాలలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 9 నెలల పిల్లలకు ఎంఆర్ వాక్సిన్ వేయాలని, అంగన్‌వాడీ, పాఠశాలల విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాల న్నారు. విద్యార్థుల తల, కళ్లు, ముక్కు, చెవి, నోరు పరీక్షించి మందులను ఇవ్వడం లేదా వైద్యశాలకు తీసుకురావాలని కోరారు. సీహెచ్‌వో భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు మద్దిలేటి, రంగస్వామి, శ్రీధర్, హెచ్ఈ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయాలి



దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న శివప్రసాద్

ఆలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యువత సమాజ సేవ చేయాలని తెలుగు యువత జిల్లా కార్యదర్శి శివప్రకాష్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీ ఎస్ తాలూకా అధ్యక్షుడు కత్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ నేషనల్ అవార్డు అందుకున్న దుర్గాప్రసాద్‌ను సన్మానించారు. బీజేపీ నాయకులు చిదానంద, అర్జున్, నరసప్ప ఉన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించండి



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను కాకుండా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని తిరుమల నగర్ భారతీ తీర్థ ఉద్యానవన కమిటీ సభ్యులు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్ కోరారు. సోమవారం తిరుమల నగర్‌లో 600 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కాలనీవాసులు శివరాం రెడ్డి, హనుమంతు రావు, వెంకటేశ్వర్లు, ధనుంజయ రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

హొళగుంద: అర్చకుడు చిప్పగిరి శ్రీకాంత్ అనంతపురం నుంచి ఏటా 200 మట్టి విగ్రహాలను రూ.55ల ప్రకారం కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపాడు. పీవోపీ విగ్రహాలతో కాలుష్యం పెరిగిందని, ప్రభుత్వం అవగాహక కల్పిస్తున్నా కొందరి తీరు మారడం లేదన్నాడు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి



ఆలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

ప్రశ్న: మండపాల నిర్వాహకులకు ఏ విధమైన సూచనలు చేస్తున్నారు?

జవాబు: గ్రామాల్లో ఇప్పటికే అవగాహన కల్పించాం. నిర్వాహకులు పోలీస్ యాప్‌లో నమోదు చేసి, అనుమతి తీసుకోవాలి మండపాలను పబ్లిక్ స్థలాల్లో కాకుండా ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేసుకోవాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదు. మండపాల వద్ద మత్తు పానీయాలు సేవించరాదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మద్యం తాగి వాహనాలు నడిపితే ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రధాన రహదారులపై తరచూ వాహనాల తనిఖీలు చేస్తున్నాం. తాగి నడిపే వారిపై కేసు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా?

జవాబు: వాణిజ్య సంస్థలు, బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. ఇంకా కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: నిమజ్జనాన్ని ఏర్పాటు చేశారా?

జవాబు: నిమజ్జనం కోసం బాపురం కాలువ వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తాం. చీకటి పడేలోగా పూర్తయ్యేలా, ప్రమాదాలు చోటుచేసుకోకుండా నిఘా ఉంచుతాం.

ప్రశ్న: అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఇప్పటికే గ్రామాల పెద్దలతో ఉత్సవాల ఏర్పాట్లపై డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చాం. ఎవరైనా ఘర్షణలకు తావిస్తే కేసులు నమోదు చేస్తాం.

జగనన్న కాలనీ.. జగన్నాటకం

● ఊర్లు నిర్మిస్తామన్న వైసీపీ... ఇళ్లు కూడా పూర్తి చేయలేకపోయింది ● నేటికీ పూర్తి కాని జగనన్న కాలనీ గృహాలు ● సమాచార లోపంతో పట్టించుకోని అధికారులు



ఇంటికి కిటికీలు బిగించకుండా, రోడ్లు వేయకుండా ఇలా వదిలేశారు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం ఊళ్లు నిర్మిస్తామంటూ ప్రగల్భాలు పలికి చివరికి ఇళ్లు పూర్తి చేయకుండా పేదల ఇళ్ల నిర్మాణంలో ఐదేళ్లు నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు 'జగనన్న కాలనీ నిర్మించడం ఓ జగన్నాటకం' అని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వం ఇళ్లు లేని వారందరికి ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎంతో ఆర్భాటంగా ఊర్లకు దూరంగా ఎక్కడ పడితే అక్కడ స్థలాలు గుర్తించి ఇళ్ల నిర్మాణలు ప్రారంభించింది. గత ప్రభుత్వాలు గృహాలు నిర్మిస్తే మేము ఊర్లు నిర్మిస్తామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అరకొర ఇళ్లు మాత్రమే పూర్తి చేసి మిగతా వాటిని అలాగే వదిలేయటంతో ఆ గృహాలు, కాలనీలు నేడు అలంకార ప్రాయంగా కనిపిస్తున్నాయి, దీంతో లబ్ధిదారులు అసంపూర్తిగా ఉన్న గృహాల్లోకి వెళ్లలేక అద్దె గృహాల్లో అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో సైతం ఇదే పరిస్థితి పట్టణ శివారులోని మాచాని శివన్న నగర్‌లో ఏపీ టిడ్కో ఇళ్ల పక్కనే గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న కాలనీలు నిర్మాణం చేపట్టగా మొత్తం 1,539 ఇళ్లు మంజూరు అయ్యాయి. 42 మంది లబ్ధిదారులు సొంతగా ఇళ్లు నిర్మించుకున్నారు. 1,022 గృహాలు ఇప్పటికి నిర్మాణంలో ఉన్నాయి. ఇందులో అసంపూర్ణంగా ఉన్న ఇళ్లను 180 మంది లబ్ధిదారులకు మంజూరు చేశారు. లోపల ప్లాస్టింగ్ చేయకుండా, బండలు వేయకుండా, బాత్ రూం నిర్మించకుండా, ఇళ్లకు తలుపులు, కిటికీలు బిగించకుండా ముందు మాత్రమే ప్లాస్టింగ్ చేసి పెయింటింగ్ వేసి ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చారు. వాటిని నిర్మించాలంటే లబ్ధిదారుడు అదనంగా రూ35 వేలు చెల్లించాలని అధికారులు అంటున్నారు.

నాసిరకం నిర్మాణాలు

నాసిరకం నిర్మాణాలు చేపట్టి లబ్ధిదారుడికి ఇచ్చిన ఇళ్లలో గోడలు పగుళ్లు ఇవ్వడం, పెచ్చులు ఊడడం జరిగాయి, ఇచ్చిన ఇళ్లలో ప్లాస్టింగ్ లేక ఇటుకలు రాలిపోతున్నాయి. చాలా వరకు ఇళ్ల మధ్యలో నిలిచి ఉండడం వల్ల నాసిరకం నిర్మాణం కావడం వల్ల పడిపోయాయి. సిమెంటు, కంకర, ఇటుకలు కావడంతో వర్షానికి తడిచి ఎండకు ఎండి



కాలనీలో పడిపోయిన విద్యుత్ స్తంభం



అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లు

పెలుసుబారి పోతున్నాయి. కొన్ని మధ్యలో కట్టి అపేసిన ఇళ్ళు పడిపోయే స్థితికి చేరుకున్నాయి.

అసంపూర్తిగా నిర్మాణాలు

జగనన్న గృహాలలో 1,022 గృహాలు ఇప్పటికి నిర్మాణంలో ఉన్నాయి. పట్టణంలోని ప్రజలకు కాకుండా ఎనుగుబాల గ్రామస్థులకు 200 మంది లబ్ధిదారులకు పట్టణంలో జగనన్న కాలనీలో గృహాలు ఇచ్చారు అ గృహాలు కూడా అసంపూర్ణంగా మిగిలాయి.

సౌకర్యాలు కరువు

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా, కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయి ఉన్నాయి. ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. నీటి పైప్ లైన్ ఏర్పాటు చేసి వదిలేశారు కానీ నీటి సౌకర్యం కల్పించలేదు, రోడ్లు, డ్రైనేజీలు మౌలిక వసతుల సౌకర్యాలు లేకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు.

రైతులందరికీ యూరియా అందిస్తాం



యూరియా పంపిణీ చేస్తున్న సహకార సంఘం అధ్యక్షుడు, అధికారులు

గోనెగండ్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రైతులు ఎవరూ అధైర్యపడవద్దని కావాల్సినంత యూరియాను ప్రభుత్వం అందజేస్తుందని కైరవాడి సహకార సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు తిమ్మారెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరి, ఏవో హేమలత అన్నారు. సోమవారం హెచ్ కైరవాడి సహకార సంఘం పరిధిలోని పుట్టపాశం, హెచ్ కైరవాడి గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను తహసీల్దార్, రాజేశ్వరి, ఏవో హేమలత తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎరువులు ఎంత స్టాక్ ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెచ్ కైరవాడి గ్రామంలోని సహకార సంఘం అవరణలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ యూరియా లేదని ఎవ్వరు బాధపడవద్దని కావాల్సినంత ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. అలాగే నానో యూరియా కూడా వాడలని దీని వల్ల నత్రజని ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాంగోపాల్ , రఘునాథ్‌యాదవ్, టీడీపీ నాయకులు మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ నరసయ్యగౌడ్, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

వైద్యులపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

నందవరం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పింఛన్ల విషయంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చిన వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసీపీ రైతు విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకా ఆదేశాలతో నందవరం ఎస్ఐ కేశవకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 165 పింఛన్లు తొలగించారని ఇది వైద్యులు పేద పింఛన్‌దారుల కడుపు కొట్టినట్లేనని అయన అవేదన వ్యక్తం చేశారు. గతంలో సదరం క్యాంపులో వైద్యులు 80శాతం నుంచి 100 శాతం వరకు వారిని పింఛన్లకు అర్హులని ప్రకటించారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు సదరం క్యాంపులో వారిని అనర్హులని ప్రకటించారన్నారు. కార్యక్రమంలో చాంద్‌బాషా, వెంకటేష్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన నిర్మాణం, జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటు చేయాలని డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణ సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీవో కార్యాలయం నుంచి బయలుదేరి అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి అనంతరం సోమప్ప సర్కిల్ నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల అల్ఫ్రెడ్ రాజు భాస్కర్, మహలింగప్ప, ఉసేనప్ప, మధు, దస్తగిరి పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో బీఎస్పీ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఆపార్టీ రాష్ట్ర నాయకులు చిందనూరు నాగరాజు, మంచాల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎమ్మిగనూరు అసెంబ్లీ ఇన్‌చార్జీ బంగారప్ప అధ్యక్షతన పార్టీ ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 'దేశంలో ఎక్కువ ఆదరణ ఉన్న పార్టీ బీఎస్పీ అని, పార్టీలో పనిచేస్తున్నందుకు మనమంత గర్వపడాలన్నారు. గ్రామస్థాయి, మండలస్థాయిల్లో కమిటీలు వేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సామేలు, రవికుమార్, రాజు, ప్రశాంత్, బాలు, అనుమన్న, రాజేష్, ఫిలిప్, బంగారప్ప, సుధ, భాస్కర్, ఏసన్న పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



శివన్న నగర్‌లోని నీటి కుంటను చూపిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివన్న నగర్‌లో చేనేత కార్మికుల వార్డు పిలువబడే కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీయం నాయకులు రాముడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివన్న నగర్‌లో అత్యధిక శాతం చేనేత కార్మికులు మగ్గం పైనే జీవనం సాగిస్తున్నారని, వారు మగ్గాలు నేసే గుంతలలో వర్షపు నీరు చేరి వారి జీవనోపాధికి ఇబ్బందిగా మారిందని అన్నారు. పైగా కాలనీలో పాములు బెడద ఎక్కువైందని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు వీధిలైట్లు మిగతా మౌలిక సమస్యల పరిష్కారం కోసం 10 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల కాలనీవాసులు మలేరియా, డెంగ్యూకు గురవుతున్నారన్నారు. వర్షపు నీరు, మురికి నీరు, పాముల బెడద నుంచి చేనేత కార్మికులను విముక్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాగరాజు, భాగ్యమ్మ పాల్గొన్నారు.

మెడిసిన్‌లో మెరిసిన గిరిపుత్రులు



సుగాలి రాజేశ్వరి



సుగాలి వీరేష్ నాయక్

మంత్రాలయం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మారుమూలప్రాంతమైన గిరిజన తాండా గ్రామం మాధవరం తాండ. బస్సు కూడా తిరగని గ్రామంలో ఇద్దరు గిరిజనపుత్రులు మెడిషన్‌లో సీటు సాధించి జిల్లాలో మెరిశారు. 2025లో జరిగిన నీట్ పరిక్షల్లో 401 మార్కులు సాధించి కడప ప్రభుత్వం రిమ్స్ వైద్యశాలలో ఎంబీబీఎస్ చదివే ందుకు సీటు సాధించాడు. అదే గ్రామానికి చెందిన సుగాలి మునినాయక్, అన్నపూర్ణల కుమార్తె సుగాలి రాజేశ్వరి నీట్‌లో 400మార్కులు సాధించి సోమవారం విడుదలపైన మెరిట్‌లో కడపలోని రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. రెక్కాడితే డోక్కాడని కూలీ కుటుంబాలలో ఇద్దరు గిరిజన ఆణిముత్యాలు మెడిసిన్‌లో సీట్లు సాధించి గ్రామానికే కాక మండలానికి పేరు తీసుకురావటంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఎమ్మిగనూరులో విజిలెన్స్ దాడులు



రైతుల వేషధారణలో ఎరువులు కొనుగోలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎమ్మిగనూరు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):విజిలెన్స్ అధికారులు ఏఓ విశ్వనాథ్, వెంకటరమణలు రైతుల వేషధారణలో ఎమ్మిగనూరు పట్టణంలో శివసర్కిల్‌లోని మానస ఎరువుల దుకాణాం, వాల్మీకి సర్కిల్‌లో పంచముఖి ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్లి యురియా, డీఏపీ ఎరువులను కొనుగోలు చేశారు. యూరియా ఎంఆర్‌పీ రూ. 266లు ఉండగా రూ. 300లకు విక్రయించారు. అలాగే డీఏపీ రూ. 1350లు ఉండగా రూ. 1400లు విక్రయించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు రెండు దుకాణాల్లో ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే ఆయా దుకాణాల గోదాముల్లో ఉన్న ఎరువుల నిల్వలను ఏఓ శివశంకర్ సాయంతో పరిశీలించారు. రూ. 47విలువ చేసే 173 యురియ బస్తాలను, రూ. 2.75లక్షలు విలువ చేసే 204 బస్తాలను సీజ్ చేశారు. అనంతరం ఇరువురు దుకాణదారులపై 6ఏ కేసు నమోదు చేశారు. రైతులకు అధికధరలకు విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా విజిలెన్స్ అధికారులు రైతులు మాదిరిగా అంగి, పంచె, మెడపై టవాల్ దరించి దాడుల్లో పాల్గొనటం ఎరువుల దుకాణదారుల్లో సంచలనం రేపింది. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారి శివశంకర్, ఏఈవో నరసింహ ఉన్నారు.

లోక కల్యాణార్థం విశ్వశాంతి మహాయాగం



మహాయాగం కోసం భూమి పూజ చేస్తున్న శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిజీ

పెద్దకడబూరు , ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం కోసం విశ్వశాంతి యాగం నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ తెలిపారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో 87వ విశ్వశాంతి యాగం మహోత్సవం కోసం యాగం నిర్వహిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 15 రోజుల పాటు ఈ మహాయాగం నిర్వహిస్తున్నామన్నారు. ఆయుత చండీ మహాయాగం, అతిరుద్ర మహాయాగం విశ్వశాంతి కోసం నిర్వహిస్తునామన్నారు. ఈ యాగంలో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చని తెలిపారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందించునున్నట్లు తెలిపారు. ఈ యాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యాగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు అదుపు

మంత్రాలయం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, అకృత్యాలు, బాల్యవివాహాలు, దళిత, గిరిజనులపై అత్యాచారాలు, కుల దూషణలు, దాడులను అరికట్టాలంటే చట్టాలపై అవగాహన కల్పించాలని ఎస్సీ ఎస్టీ సివిల్ ప్రత్యేక న్యాయాధికారి బి. లీలా వెంకట శేషాద్రి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచన మేరకు న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు నిర్వహించారు. సమావేశంలో లీగల్ అధికారులు, రెవెన్యూ, పోలీసు, వైద్య, విద్యాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జాహాన్, మహిళా సీఐ విజయలక్ష్మి, ట్రైబల్ వేల్ఫేర్ అధికారి కొండయ్య, సీడీపీవో రాజేశ్వరి దేవి, ఎమ్మిగనూరు బార్ ప్రెసిడెంట్ రషీదుల్లా, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, రఘురామిరెడ్డి, గంగాధర్ నాయక్, మంత్రాయలం సీఐ రామాంజులు, రాజేశ్వరి, శారద, మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూల్యాంకనం సరళతరం చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలలోని అసంబద్ధాలను తొలగించి మూల్యాంకన విధానాన్ని సరళతరం చేసి ఉపాధ్యాయులు సిలబస్‌పై దృష్టి పెట్టే ఆవకాశం కలిపించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, యల్లప్ప, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ర్యాలీలో పాల్గొన్న ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

కోసిగి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం కోసిగిలో స్త్రీ శక్తి పథకం ప్రారంభోత్సవంలో భాగంగా మార్కేండేయస్వామి దేవాలయం నుంచి తేరుబజారు మైదానం వరకు మహిళలతో కలసి ర్యాలీ చేశారు. అనంతరం తేరు బజారు మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్ర పటాలకు మహిళలతో కలసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళల నుద్దేశించి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్‌హిట్ అయిందని, మహిళలను గౌరవించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి చాలా తేడా ఉందన్నారు మహిళలంతా కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కన్నతల్లికి, సొంత చెల్లెలకు న్యాయం చేయలేని వైసీపీ పార్టీ అధ్యక్షుడు జగన్ మహిళలకు ఏమి న్యాయం చేస్తారని ఎద్దేవ చేశారు. బీజేపీ ఇన్‌చార్జి ఎన్. విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ మహిళా నాయకులు నరవ శశిరేఖ, ముత్తురెడ్డి, రామిరెడ్డి, రమాకాంత్‌రెడ్డి , గోపాల్‌రెడ్డి, సురేష్‌నాయుడు, జ్ఞానేష్, బసలదొడ్డి ఈరన్న, వెంకటపతిరాజు, నాడిగేని అయ్యన్న, నర్సప్ప, రామృష్ణ, వెంకటేష్, తాయన్న, ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామి పాల్గొన్నారు.

బాధ్యతల నుంచి తొలగించడం సరికాదు

ఎమ్మిగనూరు,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): వార్డు ఎడ్యూకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు ఉన్న విద్యాసంబంధింత బాధ్యతలను తొలగించి వేరోకరికి అప్పజెప్పటం సరైందికాదని వార్డు ఎడ్యూకేషన్ డేటాప్రాసెసింగ్ సెక్రటరీలు అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి పట్టణంలోని సచివాలయం వార్డు ఎడ్యూకేషన్ డేటాప్రాసెసింగ్ సెక్రటరీలు వినతిప్రతం ఇచ్చారు. కార్యక్రమంలో కుమార్, రియాజ్ రాజా, హంపిరెడ్డి, ఈరేష్, నవీన్, విక్రమ్, మల్లికార్జున పట్టణంలోని ఆయా వార్డు ఎడ్యూకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

గోనెగండ్ల, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన గోనెగండ్లలోని ముస్లింల శ్మశానానికి స్థలం కేటాయించాలని సంఘం నాయకులు ఎస్ఎన్ మాబువలి, మహమ్మద్, రంజాన్, రహంతుల్లా, జలీల్ కోరారు. సోమవారం తహసీల్దార్ రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోనెగండ్లలో దాదాపు 5000 వరకు ముస్లిం జనాభా ఉందని అందరూ వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఇందుకు తహసీల్దార్ విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి: డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి



కోసిగిలో నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ



నందవరంలో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావణంలో జరుపకోవాలని డీఎస్పీ భార్గవి అన్నారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం జరిగిన పీస్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పండుగను ఎప్పటిలాగే ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే వారు ప్రతీ ఒక్కరూ కావాల్సిన అనుమతులు ఎటువంటి ఫీజులు లేకుండా ఆన్‌లైన్‌లో తీసుకొవాలని, పోలీసు వారు ఇచ్చే అనుమతి ధృవీకరణ పత్రం స్కాన్‌కోడ్ తప్పని సరిగా మండపాలలో ఉంచాలని, వారు నిర్ణయించిన సమయం ప్రకారం మూడవ రోజు నిమజ్జనానికి బయలుదేరాలని అన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న, అల్ఫ్రెడ్ రాజు, నరసింహలు తదితరులు పాల్గొన్నారు.

నందవరం: గ్రామాల్లో వినాయక చవితి పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ కేశవ కోరారు. సోమవారం నందవరం పోలీస్టేషన్‌లో మండలంలోని అన్ని గ్రామాల పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయక ప్రతిష్ఠ రోజుకు ముందే వినాయక మండలి కమిటీ పోలీస్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు మద్యం తాగి ఘర్షణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇందుకు సదరు వినాయక మండలి కూడా బాధ్యత వహించాలన్నారు.

కోసిగి: కోసిగి మండలంలో వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతురెడ్డి అన్నారు. స్థానిక మార్కేండేయస్వామి దేవాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీనాయకులు, వినాయక విగ్రహాల ఏర్పాటు నిర్వహాకులతో సమావేశంలో సీఐ మంజునాథ్ మాట్లాడారు. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే వారందరు తప్పకుండా ఆన్‌లైన్‌లో గణేష్ ఉత్సవ్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదన్నారు. అలాగే నిమజ్జనం రోజుకుడా డప్పు, వాయిద్యాలతో మత్రామే వినాయక విగ్రహాల ఉరేగింపుగా తీసుకెళ్లాలన్నారు. పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన పెద్దలు, గణేష్ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలంలోని ప్రజలు వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని రూరల్ సీఐ బీవీ మధుసుదన్‌రావు తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయా గ్రామాల్లోని ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.